PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 167 | విజయవాడ, సోమవారం 22 జనవరి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 22 January 2024 | Rs

విజయవాడలో లెనిన్‌కు నివాళులర్పిస్తున్న వామపక్షాల నాయకులు వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ తదితరులు (వార్త 2వ పేజీలో)

విజయవాడ దిగ్బంధనం

అంగన్‌వాడీలపై రాష్ట్రవ్యాప్త నిర్బంధం

'జగనన్నకు చెబుదాం'కు రానీయకుండా అడ్డుకుంటున్న పోలీసులు

- పలు జిల్లాల్లో తొలగింపు ప్రకటనలు
- సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద బాబురావు అరెస్ట్
- నిరవధిక దీక్షా శిబిరం నుండి మరోనేత ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధం తీవ్రమౌతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వారిని విధుల నుండి తొలగిస్తున్నట్లు కలెక్టర్లు ప్రకటనలు చేశారు. సోమవారం తొలగింపు ఉత్తర్వులు జారీ చేస్తామని, 25వ తేది కొత్త నియమాకాలకు నోటిఫికేషన్ ఇస్తామని పేర్కొన్నారు. మరోవైపు సోమవారం జరగనున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి రానీయకుండా రాష్ట్ర వ్యాప్తంగా అడ్డుకుంటున్నారు. విజయవాడను పోలీసులు దిగ్బంధించారు. ఎక్కడికక్కడ అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారు. కాకినాడ టూ టౌన్ పోలీసులు స్టేషన్‌లో గ్రిల్స్ ఉన్న గదిలో అంగన్‌వాడీలను నిర్బంధించారు. విజయవాడలో సిపిఎం రాష్ట్ర కార్యాలయంలోకి వెడుతున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావును బలవంతంగా అరెస్ట్ చేశారు. విజయవాడతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌లలో మఫ్టీలో నిఘా పెట్టారు. ఈ అడ్డంకులన్నీ అధిగమించి, విజయవాడకు చేరుకున్న వారిని గుర్తించి, అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక నిఘా పెట్టారు. అంగన్‌వాడీలు బసచేసే అవకాశం మిగతా 5లో

విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద నిరసన శిబిరం పరిసర ప్రాంతంలో ఆదివారం రాత్రి రోడ్డు మీదనే నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

మైలవరం స్టేషన్లో బాబూరావు దీక్ష

సిపిఎం రాష్ట్ర కార్యాలయం వద్ద అదుపులోకి తీసుకున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావును రాత్రి 11 గంటల సమయంలో మైలవరం స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆయన ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ నుండి నేరుగా గవర్నరుపేట పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి ప్రైవేటు వాహనంలో ఎవరికీ తెలియకుండా నాలుగుగంటలు తిప్పిన అనంతరం మైలవరం స్టేషన్‌కు తీసుకెళ్లారు. అదుపులోకి తీసుకున్న సమయంలో తమ పార్టీ వారికి సమాచారం ఇవ్వాలన్నా ఇవ్వనీకుండా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మైలవరం స్టేషన్‌కు తరలించిన అనంతరం గవర్నరుపేట పరిధిలో పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసనగా మంచినీళ్లు కూడా తాగనంటూ బాబూరావు నిరాహారదీక్షకు దిగారు. పోలీసుల తీరు సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

లెనిన్ స్ఫూర్తితో వర్గ పోరాటాలు

బలోపేతం

- సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి
- పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా విఐ లెనిన్ శత వర్ధంతి

మీడియాతో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దోపిడీ రహిత సమాజం కోసం వర్గ పోరాటాలను బలోపేతం చేయాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. ఆదివారం నాడిక్కడ సిపిఎం ప్రధాన కార్యాలయం (ఎకెజి భవన్)లో విఐ లెనిన్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ.. లెనిన్ తన 54 ఏళ్ల స్వల్ప జీవితంలో ప్రపంచంలోనే మొట్ట మొదటి దోపిడీ రహిత సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించి, మానవ చరిత్రను తిరుగులేని విధంగా మార్చగలిగారని తెలిపారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడంతోపాటు దోపిడీ లేని సమాజాన్ని నిర్మించిన మహనీయుడు లెనిన్ అని కొనియాడారు. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం మాత్రమే కాదు, ప్రపంచాన్ని మార్చడం కూడా సాధ్యమేనని నిరూపించిన మహా నాయకుడు లెనిన్ అని చెప్పారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విప్లవకారులందరికీ లెనిన్ స్ఫూర్తి అని పేర్కొన్నారు. లెనిన్ శత వర్ధంతి రోజున, దోపిడీ లేని సమాజాన్ని నిర్మించడానికి, భారతదేశంలో వర్గ పోరాటాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలను తీవ్రతరం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు.

పన్నుల్లో రాష్ట్రాల వాటా కుదింపునకు మోడీ ఒత్తిడి

రాష్ట్రాలకు పన్నుల వాటాను కుదించాలని ఫైనాన్స్ కమిషన్‌పై ప్రధాని నరేంద్ర మోడీ ఒత్తిడి తెచ్చినట్లు వచ్చిన వార్తలు దిగ్భ్రాంతికి గురి చేశాయని ఏచూరి అన్నారు. ఈ విషయాన్ని ఇండియా ఫోరం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రాష్ట్రాలకు ఇచ్చే కేంద్ర పన్నుల వాటాను తగ్గించేందుకు రహస్య వ్యూహాన్ని అమలు చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంపై కేరళ ఏళ్ల తరబడి లేవనెత్తుతున్న ఆర్థిక సమస్యలు సరైనవేనని బివిఆర్ సుబ్రమణ్యం ప్రకటన రుజువు చేస్తోందని పేర్కొన్నారు. కేరళను కేంద్రం ఆర్థికంగా కుంగదీస్తోందని విమర్శించారు.

కేంద్ర పన్నుల్లో వాటాను రాష్ట్రాలకు 42 శాతం కాకుండా 32 శాతానికి తగ్గించాలని ప్రధాని పట్టుబట్టినట్లు వెల్లడికావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇది రాజ్యాంగ సంస్థ అయిన ఫైనాన్స్ కమిషన్ పని, సిఫార్సుల్లో జోక్యం చేసుకోవడమే కాకుండా, రోజువారీ ఆర్థిక వ్యవహారాలను ప్రభావితం చేసే నిర్ణయాలను కూడా అమలు చేస్తుండడం సరికాదని అన్నారు. పన్నుల వాటాను తగ్గించే ప్రయత్నాలు విఫలమైనప్పుడు వివిధ కేంద్ర పథకాలకు కేటాయింపుల్లో కోత పెట్టేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. ఆ తరువాత సెస్, సర్‌ఛార్జిలన పెద్దయెత్తున పెంచడం ప్రారంభించారని, కేంద్ర పన్నుల ఆదాయంలో సెస్, సర్‌ఛార్జిలను 28 శాతానికి పెంచారని తెలిపారు. దీని ద్వారా రాష్ట్రాలకు ఇచ్చే కేంద్ర పన్ను వాటాను తగ్గించే రహస్య వ్యూహం అమల్లోకి వచ్చిందన్నారు. రాష్ట్రానికి రావాల్సినవి ఇవ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తోందన్న కేరళ ప్రభుత్వం మాట వాస్తవమేనని, ఇలాంటివి స్పష్టం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రానికి కేంద్ర ఆదాయ కేటాయింపులు, రుణాల మిగతా 5లో

ఐఐఎంబి ఫ్యాకల్టీ నియామకాల్లో

ఎస్‌టిలకు మొండి చేయి

బెంగళూరు : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగళూరు (ఐఐఎంబి) ఫ్యాకల్టీ సభ్యులుగా ఎస్‌టిలకు అవకాశం రావడం లేదు. 2021 జనవరి నుంచి 2023 జూన్ వరకూ ఎస్‌టి కేటగిరిలో నియామకాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినా ఒక్క అభ్యర్థినీ ఫ్యాకల్టీగా నియమించలేదని ఆర్‌టిఐ దరఖాస్తుకు ఇచ్చిన సమాధానంలో ఐఐఎంబి తెలిపింది. ఆ సమయంలో జనరల్ కేటగిరిలో 23 మంది ఎంపికవగా, 17 మందే ఉద్యోగాల్లో చేరారు. ఎంపికైన ఇద్దరు ఎస్‌సి అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరారు. ఎస్‌టి అభ్యర్థి ఒక్కరికి కూడా ఐఐఎంబి అవకాశం ఇవ్వలేదు. ఒబిసిల నుంచి ఎనిమిదిమందికి ఉద్యోగాలొచ్చాయి. 22 మంది వికలాంగులు, 23 మంది ఆర్థికంగా బలహీన వర్గం (ఇడబ్ల్యుఎస్) నుంచి దరఖాస్తు చేసుకున్నా అవకాశం ఇవ్వలేదు. ప్రస్తుతం ఐఐఎంబిలో పనిచేస్తున్న ఫ్యాకల్టీలలో 10 మంది ఒబిసిలు, ఐదుగురు ఎస్‌సిలు, ఒక ఎస్‌టి ఉన్నారు.

వైసిపి, టిడిపి స్వలాభం కోసం

బిజెపికి రాష్ట్రం తాకట్టు

ప్రత్యేక హోదా ఎందుకు అడగరు?

- ఆ రెండు పార్టీలకు ఎందుకు ఓటు వేయాలి?
- మణిపూర్ ఘటనపై జగన్ ఎందుకు నోరు మెదపరు?
- పిసిసి అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వైఎస్ షర్మిల

ఆంధ్రరత్న భవన్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న షర్మిల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వలాభం కోసం కేంద్ర బిజెపికి వైసిపి, టిడిపి రాష్ట్రాన్ని తాకట్టుపెట్టాయని, ఆ రెండు పార్టీల ఎంపిలు కేంద్ర ప్రభుత్వానికి తొత్తులుగా మారారని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆరోపించారు. రాష్ట్రాన్ని బిజెపి మోసం చేస్తుంటే.. ఆ పార్టీకి మద్దతిచ్చే వైసిపి, టిడిపికి ప్రజలు ఎందుకు ఓట్లు వేయాలని ఆమె ప్రశ్నించారు. దోస్తీ కోసం చంద్రబాబు, స్వలాభం కోసం జగన్ బిజెపిపై ప్రజల వద్ద ఒక రకంగా చెబుతూ.. కేంద్రంలో మాత్రం బిజెపితో పొత్తు కొనసాగిస్తున్నారని విమర్శించారు. పిసిసి అధ్యక్షులుగా ఎన్నికైన షర్మిల విజయవాడలోని కానూరులో ఉన్న ఆహ్వానం కళ్యాణ మండపంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బిజెపికి మద్దతిచ్చే టిడిపి, వైసిపి వేర్వేరుగా పోటీ చేయడం ఎందుకు? నేరుగా బిజెపికి ఓటేయమని అడిగితే పోలా? అని ఆమె వ్యంగోక్తులు విసిరారు. రాష్ట్రానికి ఐదేళ్లు కాదు, పదేళ్లు హోదా ఉండాలని మాట్లాడిన బిజెపి ఎందుకు హోదా ఇవ్వలేదని, పోలవరం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. హోదా ఇచ్చి ఉంటే నిరుద్యోగులకు ఉద్యోగాలు, కొత్త పరిశ్రమలు వచ్చేవని అన్నారు. హోదాను తీసుకురావడంలో జగన్ విఫలమయ్యారన్నారు. రాష్ట్రం విడిపోయి పదేళ్లయినా రాష్ట్రానికి రాజధాని లేదన్నారు. చంద్రబాబు హయాంలో అమరావతి రాజధాని అన్నారని అది కూడా పూర్తి కాలేదని, జగన్ మూడు రాజధానులు అన్నారని, ఒక్క రాజధాని అయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. పదేళ్లలో రాష్ట్రం ఏమైనా అభివృద్ధి చెందిందా? పది పెద్ద పరిశ్రమలైనా ఏర్పాటు చేశారా? అని అన్నారు. టిడిపి హయాంలో రూ.2 లక్షల కోట్లు, జగన్ హయాంలో రూ.3 లక్షల కోట్లు, పాత అప్పులతో కలిపితే రూ.10 లక్షల కోట్లు అప్పులు మిగతా 2లో

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి ఛైర్మన్ మోషెన్‌రాజు

ప్రశ్నించే గొంతులు కావాలి

'మండలిలో మాస్టారు' పుస్తకావిష్కరణ సభలో మండలి ఛైర్మన్ మోషేన్ రాజు

ప్రజాశక్తి- గుంటూరు

ప్రజాస్వామ్యంలో పిడిఎఫ్ వంటి ప్రశ్నించే గొంతులు అవసరమని శాసన మండలి ఛైర్మన్ కె.మోషెన్‌రాజు అన్నారు. శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉన్నాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన అంశాలనే వారు ప్రస్తావిస్తారని, స్వార్థంలేని ప్రజా ప్రతినిధులని కొనియాడారు. పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం గత 16 ఏళ్లుగా ఎమ్మెల్సీగా మండలిలో చేసిన ప్రసంగాల సంకలనం 'మండలిలో మాస్టారు' పుస్తకాన్ని గుంటూరులోని ఎన్‌జిఓ కల్యాణ మండపంలో ముఖ్యఅతిథి మోషేన్ రాజు ఆదివారం ఆవిష్కరించారు. తొలుత సభలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి సంతాపం ప్రకటించారు. అనంతరం జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ అధ్యక్షతన జరిగిన సభలో మోషేన్ రాజు మాట్లాడుతూ మూడుసార్లు మండలికి ఎన్నిక కావడం సాధారణ విషయం కాదన్నారు. బాలసుబ్రమణ్యం ప్రసంగాలు మండలికే పరిమితం కాకుండా ప్రజలందరికీ అందించాలని పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. ఈ పుస్తకం ప్రజలకు, ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఏ ప్రభుత్వాన్నీ గుడ్డిగా విమర్శించడమో, గుడ్డిగా సమర్థించడమో పిడిఎఫ్ చేయదని పేర్కొన్నారు. పేదలకు విద్య, వైద్యం ఎలా అందించాలనే విషయంలో మిగతా 2లో

నేడు రామ్‌లల్లా ప్రతిష్ఠ

- అయోధ్యలో బహుళంచెల భద్రత
- తీర్పిచ్చిన ఐదుగురిలో నలుగురు న్యాయమూర్తులు దూరం
- సెలవుపై వెనక్కి తగ్గిన ఎయిమ్స్
- వందకుపైగా సోషల్ మీడియా అకౌంట్ల బ్లాక్

అయోధ్య : అయోధ్యలో సోమవారం రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా, 7000 మందికి పైగా అతిథులు హాజరవుతున్న ఈ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంతోపాటు కేంద్ర భద్రత ఏజెన్సీలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశాయి. భద్రతా ఏర్పాట్లలో భారీగా సాంకేతికతను వినియోగిస్తున్నట్లు అయోధ్య జిల్లా డైరెక్టర్ జనరల్ (డిజి, శాంతి భద్రతలు) ప్రశాంత్ కుమార్ తెలిపారు. ప్రతి రహదారిపై రక్షణ కల్పించడంతో పాటు మొత్తం అయోధ్య జిల్లాను రెడ్ జోన్, ఎల్లో జోన్‌గా విభజించినట్లు చెప్పారు. కొన్ని ఉగ్రవాద సంస్థల నుంచి వస్తున్న బెదిరింపుల నేపథ్యంలో భద్రతా ఏజెన్సీలు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఏఐ కెమెరాలతో భద్రతను పటిష్టం చేశామన్నారు. పది వేల సిసిటివిలు ఏర్పాటు చేశామన్నారు. కొన్ని సిసిటివిల్లో ఎఐ ఆధారిత టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని, దీని ద్వారా యాత్రికులపై గట్టి నిఘా ఉంచవచ్చునన్నారు. రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమ వేదిక వద్ద బహుభాషా నైపుణ్యం కలిగిన పోలీసు సిబ్బంది సాధారణ దుస్తుల్లో మోహరిస్తారని చెప్పారు. సరయూ నది వెంబడి ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాల సహాయంతో భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాత్రికుల రద్దీని నియంత్రించడానికి, అదనపు రద్దీని మళ్లించడానికి డ్రోన్లను పోలీసు సిబ్బంది వినియోగిస్తారని చెప్పారు.

ప్రారంభోత్సవానికి నలుగురు న్యాయమూర్తులు దూరం

రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి అయోధ్య కేసు తీర్పు ఇచ్చిన ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులను ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం అతిథులుగా ఆహ్వానించింది. వారిలో మాజీ ప్రధాన న్యాయమూర్తులు రంజన్ గొగోయ్, ఎస్ఎ బాబ్డే, ప్రస్తుత సిజెఐ డివై చంద్రచూడ్, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొనడం మిగతా 5లో

దీక్ష విరమించిన శ్రీను తల్లి, సోదరుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఆయన ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు విశాఖపట్నం విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడైన జనుపల్లి శ్రీనివాస్ తల్లి, సోదరుడు ఆదివారం దీక్ష విరమించారు. నిరహార దీక్ష చేపట్టిన వారిని శనివారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకొని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రులోనూ వారు దీక్షను కొనసాగించారు. ఈ నేపథ్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఎంపి హర్షకుమార్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు తదితరులు ఆదివారం ఆసుపత్రికి వెళ్లి వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. వారి తరుపున దీక్ష కొనసాగిస్తామని సమతా సైనిక్ దళ్ నాయకులు ప్రకటించారు.

ఎంపి సీట్లు మాకొద్దు బాబోయ్ !

- పోటీకి ముందుకురాని మంత్రులు, ఎమ్మెల్యేలు
- వైసిపిలో కొత్త చిక్కులు

నారాయణస్వామి

జయరామ్

గీత

భరత్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో టికెట్‌లు రాని వారితో వున్న తలనొప్పులను మించి టికెట్‌లు ఖరారైన వారి నుండి కూడా సమస్యలు పెరుగుతుండటం ఆ పార్టీకి చికాకును పెడుతోంది. ఇప్పటికే సర్వేల పేరుతో చాలా మంది సిట్టింగ్‌లను దూరం పెట్టి ఆ పార్టీ అసంతృప్తి రాజేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా పార్లమెంట్‌కు మీరే పోటీచేయాలని చెప్పినా కొందరు ధిక్కరిస్తున్న తీరు ఆ పార్టీని కలవరపాటుకు గురిచేస్తోంది. చిత్తూరు జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యే అయిన ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రస్తుతం గంగాధర నెల్లూరు నియోజకవర్గం నుండి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తుండగా వైఎస్సార్ కాంగ్రెస్ విడుదల చేసిన నాలుగో జాబితాలో ఆయనను అసెంబ్లీకి కాదని చిత్తూరు పార్లమెంట్‌కు అభ్యర్థిగా ప్రకటించారు. అలాగే రెండు పర్యాయాలు కర్నూలు జిల్లా ఆలూరు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు తనతో రాజకీయంగా విభేధించే విరుపాక్షికి ఆలూరు అసెంబ్లీకి పోటీచేసే అవకాశం కల్పించి తనను కర్నూలు పార్లమెంట్‌కు అభ్యర్థిగా ప్రకటించడాన్ని గుమ్మనూరు జయరామ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తనకు ఎంపి సీటు వద్దని ఆలూరు అసెంబ్లీనే ఇవ్వాలని గట్టిగా పట్టుబడుతున్నారు. ఆలూరు విషయంలో వైసిపి అధిష్టానం ఏ మాత్రం వెనక్కు తగ్గే పరిస్థితి లేదని గుమ్మనూరు జయరామ్ తీవ్ర అసంతృప్తితో పార్టీని వీడేందుకు సిద్దపడుతున్నట్లు తెలిసింది. తెలుగుదేశం ముఖ్యనేతల టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. గుంతకల్, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాలలో ఎక్కడ అవకాశం ఇచ్చినా పోటీచేస్తానని టిడిపి ముందు ప్రతిపాదనలను పెట్టినా అటువైపు నుండి సానుకూల పరిస్థితులు లేకపోవడంతోకాంగ్రెస్ పార్టీ నుండి అయినా అలూరు అభ్యర్థిగా పోటీచేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. గుమ్మనూరు జయరామ్ వైసిపి అధిష్టానంకు టచ్‌లోకి రాకుండా టిడిపి, కాంగ్రెస్‌లవైపు చూస్తున్నట్లు తెలిసింది. అలాగే గంగాధర నెల్లూరు కాకుండా చిత్తూరుకు పంపడాన్ని నారాయణస్వామి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ఆయన వర్గం అంతా నారాయణస్వామికి అసెంబ్లీకే పంపాలని కోరుతున్నారు. ఇప్పటికే రాజమండ్రి ప్రస్తుత పార్లమెంట్ సభ్యుడు మార్గాని భరత్, కాకినాడ ఎంపి వంగా గీతలు తాము పార్లమెంట్‌కు పోటీచేయలేమని గట్టిగా పట్టుబట్టడంతో వారిద్దరిని అసెంబ్లీకి పోటీచేసేందుకు అవకాశం కల్పించారు. అలాగే నంద్యాల పార్లమెంట్‌కు మైనార్టీ అభ్యర్థిని బరిలో నింపేందుకు కడప ఎమ్మెల్యే ఉప ముఖ్యమంత్రి అంజాద్‌భాష, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌లను వైసిపి అధిష్టానం ఒప్పిస్తున్నా వారు ససేమిరా అంటున్నట్లు తెలిసింది. అలాగే ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి ఎవరనే అంశాన్ని ఆపార్టీ తేల్చలేక పోతోంది. మొత్తంగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో ఎంపి అభ్యర్థుల ఎంపిక ఆపార్టీకి తలనొప్పిగా మారింది.

చంద్రబాబు కుట్రలో ఆఖరి అస్త్రం షర్మిల

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూతురిగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెల్లెలుగా గుర్తింపు పొందిన వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరడం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కుట్రలో ఆఖరి అస్త్రంగా వున్నదని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో వైఎస్ షర్మిల ఎపిపిసిసి అధ్యక్షులుగా బాధ్యతలు తీసుకోవడంపై మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబును సిఎం చేయాలనే లక్ష్యం వైఎస్ షర్మిలలో కనిపిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉనికి లేని పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి, వైఎస్సార్ కుటుంబానికి తీరని అన్యాయం చేసిందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సిఎం జగన్ పనిచేస్తున్నారని తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ ఇబ్బందులకు గురి చేసిందన్నారు. వైఎస్సార్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్పింది కాంగ్రెస్సేననే అంశాన్ని షర్మిల మర్చిపోయినట్లున్నారని విమర్శించారు. తెలంగాణ నుంచి రాష్ట్రానికి హఠాత్తుగా ఎందుకొచ్చారో ప్రజలకు వివరించాలన్నారు. ఎవరికి ఆయుధంలా ఉపయోగపడాలని వచ్చారో అందరికీ తెలుసన్నారు. ఇదంతా చంద్రబాబు ఎత్తుగడేనని ఆరోపించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సమ్మెలో వున్నా స్పందించరా?

- యుగ తులసి పార్టీ అధ్యక్షులు శివకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలు 40 రోజులుగా సమ్మె చేస్తున్నా సిఎం జగన్ స్పందించకపోవడం సరైందికాదని, తక్షణమే వారి సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని యుగ తులసి పార్టీ అధ్య క్షులు కొలిశెట్టి శివకుమార్ అన్నారు. ఆదివారం ఆయన విజయవాడ లోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సమస్య లపై ఏ మాత్రం అవగాహనలేని వారు ఎమ్మెల్యేలు, ఎంపిలుగా వున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ కూడా తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాటలో రాష్ట్రంలో మంచి కార్యక్రమాలు చేపడతారనే నమ్మకంతో తాను మొదట స్థాపించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని జగన్‌కు ఇచ్చానన్నారు. తమ నమ్మ కాన్ని వమ్ము చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని తెలిపారు. అలాగే టిడిపి పాలకమండలిలో బిజెపి అగ్రనేతలు ఎవరి పేరు చెబితే వారిని నిబంధనలకు విరుద్ధంగా సభ్యులుగా నియమిస్తున్నారని అన్నారు. బిజెపి, వైసిపి ఒక్కటేనని అన్నారు. ప్రజలను చైతన్యం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేస్తామన్నారు.

ఆదాని ఆయుధ కర్మాగార నిర్మాణాన్ని ఆపాలి

- ఎపి ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి-ఏలూరు

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకవారి గూడెంలో నిర్మిస్తున్న అదాని ఆయుధ కర్మాగారం భూసేకరణ వెంటనే నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోత రామారావు, కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో 1166 ఎకరాల్లో ఆయుధ కర్మాగారం నిర్మించేందుకు రమణక్కపేట, దాట్లవారి గూడెం, కొత్తసీమలవారి గూడెం, వంకవారి గూడెం గ్రామాలకు చెందిన ఆదివాసుల భూములను సేకరణకు అధికారులు శనివారం గ్రామ సభ నిర్వహించారని తెలిపారు. గ్రామ సభలో ఆయా గ్రామాల ప్రజలు భూ సేకరణను వ్యతిరేకిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారని వివరించారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో గ్రామ సభలకు విస్తృతమైన అధికారాలు ఉన్నాయని తెలిపారు. గ్రామసభ తీర్మానం ప్రకారం ఆయుధ కర్మాగార నిర్మాణాన్ని వెంటనే ఆపాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆయుధ కర్మాగారం నిర్మాణాన్ని నిలుపుదల చేయకపోతే ఆదివాసుల ఆగ్రహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చవిచూడాల్సి వస్తుందని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు హెచ్చరించారు.

సోషలిజం అజరామరం

- లెనిన్ శతవర్ధంతి సభలో వక్తలు
- పలు పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సోషలిజం అజరామరమని, పేదలు, కూలీలు, శ్రామికులు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని, ఎర్రజెండా ఉన్నంతకాలం శ్రామికవర్గ పోరాటాలు ఉంటాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. రష్యా విప్లవ యోధుడు విఐ లెనిన్ శత వర్ధంతి సభ ఆదివారం విజయవాడలోని లెనిన్ సెంటర్లో జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ క్రేన్ సాయంతో లెనిన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లెనిన్ జీవితం, ఆచరణ, రష్యా విప్లవ చరిత్రకు సంబంధించి ప్రజాశక్తి, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు ప్రచురించిన పుస్తకాలను వారు ఆవిష్కరించారు. అలాగే రెండు సంస్థలూ ఉమ్మడిగా ప్రచురించిన లెనిన్ ప్రత్యేక కేలండరునూ విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సోషలిజం అజరామరమని కార్మికవర్గ పోరాటాలు ఉన్నంత కాలం అది ఉంటుందని, రాబోయే కాలంలో ప్రపంచంలో కమ్యూనిజం వస్తుందని, క్యాపిటలిజాన్ని పూడ్చిపెడుతుందని, అది చరిత్ర చెబుతున్న వాస్తవమని అన్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించగలమనే ధైర్యాన్ని ప్రపంచానికి అందించిన లెనిన్, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. భౌతికంగా చనిపోయినా కోట్ల మంది ప్రజల హృదయాల్లో వంద సంవత్సరాల తరువాత కూడా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఒకప్పుడు సోవియట్లో ప్రజల రాజ్యం నడిచిందని, కమ్యూనిస్టులకే అది సాధ్యమైందని పేర్కొన్నారు. నేటి ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ చేస్తున్న అరాచకాలు అన్నీ ఇన్ని కావని, ప్రజలను దోచుకోవడం తప్ప సంక్షేమం వారికి పట్టడం లేదని అన్నారు. దేశంలో మోడీ కూడా ప్రజల బాధలు వదిలేసి మతం పేరుతో రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంస్కృతిక నిరంకుశత్వాన్ని ప్రజలపై రుద్దుతున్నారని అన్నారు. మోడీ విధానాలను లెనిన్ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. అంబేద్కర్ ఇచ్చిన లౌకిక రాజ్యాన్ని మోడీ తుంగలో తొక్కారని పేర్కొన్నారు. మత ప్రాతిపదికన దేశాన్ని పాలిస్తున్నారని అన్నారు. మోడీ గొప్పవారని ఆయన సొంత మీడియా ప్రచారం చేసుకుంటోందని, వాస్తవంగా మోడీ విఫల ప్రధాని అని విమర్శించారు. దాన్నుండి బయటపడటం కోసం మతాన్ని ముందుకు తెచ్చి విశ్వాసాలతో ఆడుకుంటున్నారని దుయ్యబట్టారు. దేశంలో 28 కోట్ల మంది ప్రజలు పేదరికంలో ఉంటే వారి గురించి మోడీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. శ్రమజీవులు, కష్టజీవులు, పేద ప్రజానీకం ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందని అన్నారు.లెనిన్ వర్ధంతిని ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాల్లో జరుపుతున్నారంటే అది సోషలిజం, కమ్యూనిజాన్ని అనుసరించిన లెనిన్ సిద్ధాంత గొప్పతనమని పేర్కొన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వర్గపోరాటాల ద్వారానే ప్రజా పోరాటాలు బలోపేతం అవుతాయని లెనిన్ నిరూపించారని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి మాట్లాడుతూ.. ప్రపంచంలో మహిళా సమానత్వాన్ని కోరుకున్న వ్యక్తి లెనిన్ అని అన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ.. లెనిన్ పాలన ప్రపంచానికి ఆదర్శమని, పెట్టుబడిదారీ దేశాలు ఎన్నికుట్రలు చేస్తున్నా వాటిని ఇప్పటికీ అడ్డుకోగలుగుతుంది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. దివికుమార్ మాట్లాడుతూ.. సిద్ధాంతం లేని పోరాటం సరికాదని, బలమైన ఆచరణతో కూడిన సిద్ధాంతమే సమాజ మార్పునకు మూలమని లెనిన్ నిరూపించారని వివరించారు. ఈ కార్యక్రమంలో బుడ్డిగ జమిందార్, ప్రజాశక్తి, విశాలాంధ్ర బుక్‌హౌస్ జనరల్ మేనేజర్లు కె లక్ష్మయ్య, మనోహర్‌నాయుడు, సిపిఎం నాయకులు సిహెచ్ బాబూరావు, కాశీనాథ్, సిపిఐ నాయకులు జి కోటేశ్వరరావు, దుర్గాభవానీ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ గడ్డం కోటేశ్వరరావు, సాహితీ స్రవంతి నాయకులు శాంతిశ్రీ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ఛైర్మన్ గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. లెనిన్ శత వర్ధంతి నేపథ్యంలో ఐదు రోజుల పాటు లెనిన్ విగ్రహం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దళితునిపై దాడి!

- నిందితుడు దెందులూరు ఎంఎల్‌ఎ చిన్నాన్న కుమారుడు?
- చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్, టిడిపి దళిత నాయకులు

ప్రజాశక్తి- ఏలూరు టౌన్

తమ పొలంలో చేతబడి చేస్తున్నాడంటూ దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన దళితుడు దొండపాటి శ్రీను (చంటి)పై దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ్యచౌదరి చిన్నాన్న కుమారుడు భరత్‌చౌదరి (నాని) దాడి చేసి చితకబాదినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం పెదవేగి మండలం రాయన్నపాలెంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసినట్లు చెబుతున్నారు. దీనికి సంబంధించి బాధిత వృద్ధుని వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీని ప్రకారం... నాని నుంచి పొలాన్ని చంటి కౌలుకు తీసుకున్నారు. పొలంలో కోడి ఈకలు ఉన్నాయని, మా మీద చేతబడి చేస్తున్నావా అంటూ చంటిపై నాని దాడి చేశారు. దెబ్బలకు తాళలేక, వదిలేయండయ్యా అంటూ ఎంత బతిమలాడినా కనీసం కనికరించలేదు. విషయం బయటకు పొక్కడంతో హుటాహుటిన ఏలూరులోని పత్తేబాద్‌లోగల ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చంటికి రహస్యంగా చికిత్స చేయించినట్లు, అనంతరం ఎవరి కంటా పడకుండా రహస్య ప్రదేశానికి నాని తరలించినట్లు ప్రచారం జరుగుతోంది. దళితునిపై దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, చంటికి మెరుగైన వైద్యం అందించాలని కెవిపిఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, టిడిపి దళిత నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆదివారం మరో వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ అయింది. తనను ఎవరూ కొట్టలేదని, మోటార్ బైక్‌పై నుండి పడిపోయాయని చంటి చెబుతున్నట్లు ఈ వీడియో సందేశంలో ఉంది. వీటిపై పోలీసులను మీడియా వివరణ కోరగా, దాడి ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదని, వీడియో సందేశంపై పరిశీలన చేయాలని పోలీసులను తన సిబ్బందిని ఆదేశించానని పెదవేగి సిఐ కె.శ్రీనివాస్ కుమార్ తెలిపారు.

పల్నాడు జిల్లా వినుకొండ మండలం విఠంరాజుపల్లి చెరువులో జలదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు

వీధులు ఊడుస్తూ.. జలదీక్ష చేస్తూ...

అంగన్‌వాడీల నిరసన ప్రదర్శనలు ● ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని డిమాండ్

నెల్లూరులో దీక్షలు కొనసాగిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తదితర డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 41వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగించారు. వీధులు ఊడుస్తూ, జలదీక్ష చేస్తూ, మోకాళ్లపై నిలబడి నిరసన ప్రదర్శనలు చేశారు. పలుచోట్ల రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం మొండివైఖరిని విడనాడాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా పెదనందిపాడులో వీధులు ఊడ్చి నిరసన తెలిపారు. పెదకాకానిలో సమ్మె శిబిరాన్ని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ బెదిరింపులు, ఒత్తిళ్లకు లొంగబోమని తెనాలి సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు ప్రతిజ్ఞ చేశారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం విఠంరాజుపల్లి గ్రామంలోని చెరువలో దిగి అంగన్‌వాడీలు జలదీక్ష చేశారు. జగన్ తమను నిండా ముంచేశారంటూ దండాలు పెడుతూ నిరసన తెలిపారు. అంగన్‌వాడీలను బెదిరించి... విధుల్లో చేరుతున్నట్లు లేఖలు తీసుకుంటున్నారనే కారణంతో నాదెండ్ల సిడిపిఒ కార్యాలయంలో నాయకులు నిరసన తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరంలో లక్ష సంతకాలు సేకరించి ప్రదర్శనగా ఉంచారు. అనంతరం విజయవాడలోని రాష్ట్ర నాయకత్వానికి పంపించారు. నందిగామలో అంగన్‌వాడీలు మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. విజయనగరం జిల్లా సాలూరులో ఆకులు తింటూ, పాలకొండలో కళ్లు మూసుకొని, విజయనగరంలో దండాలు పెడుతూ నిరసన తెలిపారు. శృంగవరపుకోటలో రాస్తారోకో చేశారు. గజపతినగరంలో 41 అంకె ఆకృతిలో నిరసన తెలిపారు. అనకాపల్లి జిల్లాలోని పరవాడ, అనకాపల్లి, చోడవరంలలో దీక్షలు కొనసాగాయి. అల్లూరి జిల్లా విఆర్. పురంలో అంగన్‌వాడీల సమ్మెకు సిఐటియు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సంఘీభావం తెలిపారు. అన్నమయ్య, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో అంగన్‌వాడీలు ఐసిడిఎస్, ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విజయవాడకు బయలుదేరారు. ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. అంగన్ వాడీల సమ్మెకు సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాలా అంజయ్య మద్దతు తెలిపారు. తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలో సమ్మె శిబిరాలు కొనసాగాయి. విజయవాడకు వెళ్లరాదంటూ సమ్మె శిబిరాల్లో ఉన్న అంగన్‌వాడీలకు పోలీసులు ముందస్తు నోటీసులు అందించారు. శ్రీకాకుళం, కృష్ణా, నెల్లూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నిరసన దీక్షలు కొనసాగాయి.

మంత్రి పెద్దిరెడ్డిని అడ్డుకున్న అంగన్‌వాడీలపై కేసులు

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన 10 మంది అంగన్‌వాడీలపై పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకున్నారంటూ ఈ చర్యలు తీసుకున్నారు. తహశీల్దారు ఫిర్యాదు మేరకు సుమారు పది మందిపై కేసులు నమోదు చేశారు. సిఐటియు నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, ఎఐటియుసి నాయకులు చంద్రాయుడుతోపాటు మరో ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఈ నెల 23న ఉరవకొండలో సిఎం జగన్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డిని అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. కాన్వాయ్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని బలవంతంగా పక్కకు లాగేసి కాన్వాయ్‌ను ముందుకు కదిలించారు. మంత్రిని అడ్డుకున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

వింటారో లేదో సిఎం తేల్చుకోవాలి

- సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణ
- అంగన్‌వాడీల సమ్మె న్యాయ సమ్మతమైంది
- మద్దతుగా వామపక్షాల ప్రదర్శన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమస్యలు వింటారో లేదో సిఎం తేల్చుకోవాలని, వారి పోరాటం న్యాయ సమ్మతమైందని, ఇప్పటికైనా పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని ఉంచాలో లేదో అంగన్‌వాడీలే తేలుస్తారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు హెచ్చరించారు. అంగన్‌వాడీల నిరవధిక నిరాహార దీక్షలు ఐదోరోజుకు చేరిన నేపథ్యంలో సిపిఎం, సిపిఐ, వామపక్షాల ఆధ్వర్యాన ఆదివారం ఉదయం లెనిన్ సెంటర్ నుండి ధర్నాచౌక్‌లోని దీక్షా శిబిరం వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మహిళా శక్తికి మించింది మరొకటి లేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుండా వారిని నిరాహార దీక్ష చేసే వరకూ తీసుకెళ్లిన సిఎం.. అంగన్‌వాడీల సమస్యలు విని పరిష్కరిస్తారో లేదో తేల్చుకోవాలన్నారు. వారితో పెట్టుకున్న ప్రభుత్వాలేవీ ఇంతవరకు నిలబడిన దాఖలాలు లేవని ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని అన్నారు. సోమవారం అంగన్‌వాడీలు చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. సమస్యను పరిష్కరించడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ.. మహిళలంటే చులకనగా చూస్తున్న ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సాహితీ స్రవంతి నాయకులు శాంతిశ్రీ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. సామాజిక న్యాయం పేరుతో హడావుడి చేస్తున్న వైసిపి ప్రభుత్వం అంగన్‌వాడీలుగా ఉన్న దళిత, గిరిజన, ఒంటరి, వెనుకబడిన మహిళలపై కక్షసాధింపు చర్యలకు దిగుతోందని అన్నారు. అలాగే పలు సంఘాల నాయకులు మద్దతు ప్రకటించిన వారిలో ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి
సిఎస్‌కు ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ లేఖ

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి సాంబిరెడ్డి, ఎంవి ఆంజనేయులు.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి లేఖ రాశారు. ఆదివారం లేఖను మీడియాకు విడుదల చేశారు. అంగన్‌వాడీలు చేస్తున్న సేవలు అత్యవసరమని, వారికి పిఆర్‌సి అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో రోజుకు రూ.600 వేతనం తగ్గకుండా ఇవ్వాలని అన్నారు. వెంటనే వారి సమ్మెను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'ఉక్కు' ప్రయివేటీకరణ కుట్రలను తిప్పికొడతాం

- స్టీల్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను శతశాతం ప్రయివేటీకరించేందుకు కేంద్రంలోని మోడీ సర్కారు చేస్తోన్న ప్రయత్నాలను పోరాటాలతో తిప్పికొడతామని స్టీల్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు ఎస్.సత్యనారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1074వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ సభ్యులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వ రంగ సంస్థలే కీలకమన్నారు. అవి ప్రయివేటుపరమైతే ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులు, మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఉండడం వల్లనే అనేక మంది ఉద్యోగాలు చేస్తూ గౌరవప్రదంగా బతుకుతున్నారన్నారు. పబ్లిక్ సెక్టార్ భావితరాలకు గట్టి భరోసా అని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చర్యలను కేంద్ర ప్రభుత్వం ఆపే వరకూ పోరాటాన్ని ఆపేదిలేదని స్పష్టం చేశారు. దీక్షల్లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల అంగన్‌వాడీ ఉద్యమానికి కార్మిక సంఘాల మద్దతు

- సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం చేపట్టిన జగనన్నకు కోటి సంతకాల ఉద్యమానికి రాష్ట్రంలోని కీలకమైన మూడు కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు ఆదివారం విజయవాడలోని ఎంబివికెలో నిర్వహించిన మీడియా సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది చిరుద్యోగులకు ప్రభుత్వం వేతనాలు పెంచలేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు 35 ఏళ్ల సర్వీసు వున్నా రూ.11,500 వేతనం ఇస్తున్నారని, పెరిగిన ధరల వల్ల ఈ వేతనంతో ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. వేతనాలు పెంచాలని న్యాయమైన డిమాండ్లతో 40 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటాలకు కార్మిక సంఘాలుగా సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. సోమవారం అంగన్‌వాడీలు చేపట్టిన జగనన్నకు కోటీ సంతకాల సమర్పించు కార్యక్రమానికి తమ సంపూర్ణ మద్దతు వుంటుందని అన్నారు. రాష్ట్రంలోని కార్మికవర్గం అంతా అంగన్‌వాడీలు విజయం సాధించే వరకూ పోరాటాలకు అండగా నిలవాలని కోరారు.

నేను బాగానే ఉన్నా : తమ్మినేని

తమ్మినేనిని పరామర్శిస్తున్న బివి రాఘవులు తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన ఆరోగ్యం రోజురోజుకూ మరింత మెరుగవుతోందనీ, మానసికంగా, శారీరకంగా తాను బాగానే ఉన్నానని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. వైద్యుల సూచనల మేరకు తనను చూసేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఇతరులను కలవలేకపోతున్నానని ఆయన పేర్కొన్నారు. ఇది కొంత ఇబ్బందికరమేనని తెలిపారు. త్వరలోనే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి... పార్టీకి సంబంధించిన సాధారణ కార్యక్రమాలన్నింటిలోనూ పాల్గొంటానని తెలిపారు. ఆదివారం సాయంత్రం సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పి.ప్రభాకర్, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు ఎఐజి ఆస్పత్రిలో తమ్మినేనిని పరామర్శించి, ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అంతకు ముందు నవతెలంగాణ ఫీచర్స్ ఎడిటర్ ఆనందాచారి, న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేశ్, బోర్డు సభ్యులు కెఎన్ హరి, వేణుమాధవ్, బసవపున్నయ్య, బివిఎన్ పద్మరాజు, అనంతోజు మోహనకృష్ణ, అజయ్ తమ్మినేనిని పరామర్శించేందుకు ఎఐజి ఆస్పత్రికి వెళ్లారు. ఆ సమయంలో వైద్యుల సూచనల మేరకు వారు ఆయన్ను కలవలేక పోయారు. ఈ విషయం తెలుసుకున్న తమ్మినేనిపై విధంగా స్పందించారు.

వైసిపి, టిడిపి స్వలాభం కోసం బిజెపికిరాష్ట్రంతాకట్టు

(మొదటిపేజీ తరువాయి)

చేశారన్నారు. కానీ అభివృద్ధి ఎక్కడా కనబడటం లేదన్నారు. రాష్ట్రంలో ఒక్క మెట్రో కూడా లేదన్నారు. కనీసం రాష్ట్రంలో రోడ్లు వేసేందుకు డబ్బులు లేవని, ఉద్యోగులకు నెల మొదటి వారంలో వేతనాలిచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు, దహనాలు జరిగితే జగన్ ఎందుకు స్పందించడం లేదని షర్మిల ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇసుక, లిక్కర్, మైనింగ్ మాఫియా ఉందని, దోచుకోవడం దాచుకోవడమే వీరి పని అని అన్నారు. వైఎస్ఆర్‌ను అభిమానించే వారందరూ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు. సభలో పిసిసి మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డి, శైలజానాథ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కెవిపి రామచంద్రరావు, కసుమూరి బాపిరాజు, చింతా మోహన్, జెడి శీలం, సుంకర పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు. షర్మిల గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి కానూరు కళ్యాణ మండపానికి వచ్చే క్రమంలో అత్యధిక వాహనాలకు అనుమతి లేదంటూ పోలీసులు కొద్దిసేపు కాన్వాయ్‌ను నిలిపేశారు. దీంతో కొద్దిసేపు రోడ్డుపై కాంగ్రెస్ శ్రేణులు ధర్నాకు దిగారు.

కాంగ్రెస్‌లో చేరిన మంగళగిరి ఎమ్మెల్యే ఆర్‌కె

మంగళగిరి ఎమ్మెల్యే ఆర్ రామకృష్ణారెడ్డి.. షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతోపాటు వైసిపి నాయకులు శెట్టి గంగాధర్ కూడా పార్టీలో చేరారు. కార్యక్రమం అనంతరం ఆంధ్రరత్న భవన్‌కు వచ్చిన షర్మిల తనకు కేటాయించిన క్యాబిన్‌లో ఆశీనులయ్యారు. పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 175 ఎమ్మెల్యే, 25 ఎంపి స్థానాల్లో పోటీ చేస్తామన్నారు.

ప్రశ్నించే గొంతులు కావాలి

(మొదటిపేజీ తరువాయి)

బాలసుబ్రమణ్యం స్పష్టమైన వైఖరితో మాట్లాడేవారని, సభలో ఆయనే మాస్టారని వివరించారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పుస్తక పరిచయం చేశారు. 2007లో శాసన మండలి పునరుద్ధరించిన నాటి నుండి బాలసుబ్రమణ్యం పేదలకు సంబంధించిన అంశాలపై అనేక ప్రసంగాలు చేశారన్నారు. ఆయా ప్రసంగాలను విద్య, వైద్యం, సామాజిక అంశాలు, ఉపాధి, అభివృద్ధి తదితర అంశాలుగా విభజించి పుస్తకం రూపొందించినట్లు తెలిపారు. కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా ప్రజాసమస్యలను ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతూ వాటి పరిష్కారానికి కృషి చేయడం పిడిఎఫ్ ప్రత్యేకతన్నారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పుస్తకం 16 ఏళ్లలో ప్రభుత్వాల పాలనా తీరుకు, ప్రజల సమస్యలకు సాక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ బాలసుబ్రమణ్యం అందరికీ ఆదర్శమని, ఆయన నుండి ఎంతో నేర్చుకున్నామని అన్నారు. ప్రతి అంశంపై స్పష్టతతో, నిర్భీతితో మాట్లాడే వారని తెలిపారు. ప్రముఖ ఆర్థికవేత్త వెంకటేష్ ఆత్రేయ మాట్లాడుతూ కొద్దిమందికి మేలు చేసే విధానాలు కాకుండా కోట్లాది మందికి లబ్ధి చేకూరేలా అభివృద్ధి విధానం కోసం దేశ ప్రజలు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. 1990 దశంలో ప్రారంభమైన ఉదారవాద విధానాలు, ప్రస్తుత బిజెపి విధానాల ఫలితంగా దేశంలో ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు మరింత పెరిగాయని తెలిపారు. ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయని అన్నారు. అందుకు భిన్నంగా కేరళ ప్రభుత్వం భూ సంస్కరణలు అమలు చేసి మానవృద్ధిలో, అక్షరాస్యతలో, అన్ని రంగాల్లో ముందు భాగాన నిలిచిందని వివరించారు. సభలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు, జెవివి తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలోని సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన శతవర్ధంతి సభలో లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంవిఎస్ శర్మ తదితరులు

కర్నూలులో నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

లెనినిజం అజేయం

● రాష్ట్ర వ్యాప్తంగా లెనిన్ శత వర్ధంతి సభలు, సమావేశాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

లెనినిజం ఎప్పటికీ అజేయమని వక్తలు పేర్కొన్నారు. కారల్ మార్క్స్ ఎంగెల్స్ రూపొందించిన మార్క్సిజం సిద్ధాంతాన్ని ప్రపంచస్థాయిలో అమలు చేసిన వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. ఆ సిద్ధాంతానికి అనుగుణంగానే రష్యాలో సోషలిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం, సిపిఐ, ఎస్‌యుసిఐ (సి) ఆధ్వర్యంలో ఆదివారం విప్లవ సారథి లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.

విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రం, సందరి ప్రసాదరావు భవన్‌లో జరిగిన లెనిన్ శత వర్ధంతి సభల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో దోపిడీ రాజ్యాలను కూల్చి కార్మిక రాజ్యాలు స్థాపించిన నాడే ప్రజలకు దోపిడీ నుంచి విముక్తి కలుగుతుందని అన్నారు. కేంద్రంలో మోడీ నాయకత్వంలో నిరంకుశ ప్రభుత్వం నడుస్తోందని, దీనిని బలంగా ఎదుర్కోవాల్సి ఉందని తెలిపారు.

కర్నూలు జిల్లా కార్మిక కర్షక భవన్, సూర్జిత్ భవన్, సుందరయ్య సర్కిల్‌లో నివాళులర్పించారు. కర్షక భవన్‌లో ప్రజాశక్తి బుక్ హౌస్ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. 'లెనిన్ బాల్యం-జీవితం' పుస్తకాన్ని, కేలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి రామాలయం పేరుతో మత రాజకీయం చేస్తోందన్నారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వి శంకర్ శర్మ, ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఐ లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె సురేష్ కుమార్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా సిపిఎం కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం గేయానంద్ మాట్లాడుతూ కారల్‌మార్క్స్, ఎంగెల్స్ రూపొందించిన కార్మికవర్గ సిద్ధాంతాన్ని సోవియట్ యూనియన్‌లో అమలు జరిపిన గొప్ప తత్వవేత్త లెనిన్ అన్నారు. మంగళగిరిలోని సిపిఎం కార్యాలయంలో, తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం, పల్నాడు రోడ్డు, అమరావతి, చిలకలూరిపేట, క్రోసూరులోని సిపిఎం కార్యాలయాల్లో సభలు నిర్వహించి లెనిన్ చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు.

పార్వతీపురం మన్యం జిల్లా సుందరయ్య భవనంలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం కృష్ణమూర్తి మాట్లాడారు. ప్రపంచంలో కార్మిక రాజ్యం, సోషలిజం నిర్మాత, మార్క్సిజాన్ని ఆచరణలో పెట్టిన మహా మేధావి లెనిన్ అని అన్నారు. పాలకొండ, సాలూరు, విజయనగరం ఎల్‌బిజి భవనంలో లెనిన్ శత వర్ధంతి సభ జరిగింది.

ఏలూరు జిల్లాలోని ఏలూరు, టి.నరసాపురం మండలాల్లో నిర్వహించారు. ఏలూరులోని పవర్‌పేట సిపిఎం జిల్లా కార్యాలయంలో, సిపిఐ జిల్లా కార్యాలయంలో సిఐటియు, సిపిఎం జిల్లా శాఖల ఆధ్వర్యంలో లెనిన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం, ప్రజాశక్తి బుక్‌హౌస్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన లెనిన్ చిత్రపటంతో ఉన్న కేలెండర్‌ను, లెనిన్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఒంగోలు సుందరయ్య భవన్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న దారిద్ర్యం, వెట్టిచాకిరీ, వలస పాలన విధానంపై మార్క్సిజం ద్వారా అంతమొందించిన లెనిన్ స్ఫూర్తితో నాయకులు ముందుకు సాగాలని సూచించారు. నాయుడుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై సిద్ధయ్య మాట్లాడుతూ ప్రపంచంలో కమ్యూనిస్టు నాయకత్వాన కష్టజీవుల రాజ్యం కోసం (సోషలిస్టు రాజ్యం) పోరాడి సాధించిన మొట్టమొదటి మహోన్నత వ్యక్తి లెనిన్ అని పేర్కొన్నారు.

తిరుపతి జిల్లా తిరుపతి నగరం యశోదనగర్‌లోని ఎంబి భవన్, నాయుడుపేట సిఐటియు కార్యాలయం, శ్రీకాళహస్తి సిపిఎం కార్యాలయం, గూడూరు పట్టణంలో, వైఎస్ఆర్ జిల్లా కడపలో సిపిఎం జిల్లా కార్యాలయం, జమ్మలమడుగులో, నెల్లూరు జిల్లా కందుకూరులో, పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకులో, కాకినాడలోని జడ్‌పి సెంటర్‌లో, రూరల్ మండలం వలసపాకలలో, అనకాపల్లి, రాంబిల్లి, కోటపాడు మండల కేంద్రాల్లో, శ్రీకాకుళం, టెక్కలిలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

గవర్నర్‌తో సిఇఒ ఎంకె మీనా భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నర్ అబ్దుల్ నజీర్ అహ్మద్‌తో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సిఇఒ) ముఖేష్‌కుమార్ మీనా ఆదివారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. జనవరి 25న నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని గవర్నరుకు మీనా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో ఎన్నికల సంఘం చేపడుతున్న అంశాలు, కార్యకలాపాలను గవర్నరుకు వివరించారు. ఓటర్ల తుది జాబితా విడుదలకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రణాళికను గవర్నరుకు ఎంకె మీనా వివరించారు. ఈ భేటీలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.

నెల్లూరు నుంచి పవన్‌కల్యాణ్ క్షేత్రస్థాయి పర్యటనలు

● నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఈ నెలాఖరు నుంచి క్షేత్రస్థాయి పర్యటనలు చేయనున్నారని ఆ పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రతిరోజూ మూడు సభలు నిర్వహించేలా ప్రణాళికలు తయారుచేస్తున్నామని వెల్లడించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎన్నికల కార్యక్రమాల నిర్వహణ జోనల్ కమిటీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ.. సభలు, సమావేశాలు నిర్వహించేందుకు నిబంధనలు కఠినంగా ఉంటాయని, అనేక ప్రభుత్వ శాఖల నుంచి ముందు నుంచే అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పవన్‌కళ్యాణ్ సభలను జయప్రదం చేయడానికి ప్రత్యేక దిశా నిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో కష్టపడి పనిచేసే ప్రతికార్యకర్తనీ పార్టీ గుర్తుంచుకుంటుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ లీగల్ సెల్ ఛైర్మన్ ఇ సాంబశివప్రతాప్, పార్టీ కార్యక్రమాల నిర్వహణ విభాగం ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, అధ్యక్షుల వారి రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్, డాక్టర్స్ సెల్ ఛైర్మన్ బొడ్డేపల్లి రఘు, వైస్ ఛైర్మన్ డాక్టర్ పి గౌతమ్‌రాజ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడపాటి శివదత్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

జనసేనలో చేరుతున్నా : కొణతాల

ప్రజాశక్తి - అనకాపల్లి

పవన్ కల్యాణ్ ఆలోచనలు నచ్చి జనసేనలో చేరుతున్నట్టు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తెలిపారు. అనకాపల్లిలోని రింగ్ రోడ్డులోని పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం కొణతాల అభిమానుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినాయకులైన పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌తో తనకు అత్యంత సాన్నిహిత్యం ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి ఉత్తరాంధ్ర బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారన్నారు. పవన్ మాటమీద నిలబడే వ్యక్తి అని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయనతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. ఈ సందర్భంగా కొణతాలను ఆయన ఆత్మీయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ డివివి.గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌లో రాష్ట్రానికి మూడోస్థానం

● 23న పురస్కారం అందుకోనున్న ద్వివేది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఖనిజ తవ్వకాలు (మైనింగ్) రంగంలో జాతీయ స్థాయిలో రాష్ట్రం మూడో స్థానంలో నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ఇది సాధ్యమైందని గనులశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది కాలంలోనే 11 బ్లాక్‌లకు వేలం ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రోత్సాహక పురస్కారం (అవార్డ్ ఆఫ్ అప్రిషియేషన్) ప్రకటించినట్లు పేర్కొంది. ఈ నెల 23న భోపాల్‌లో నిర్వహించే రాష్ట్రాల గనుల శాఖల మంత్రుల ద్వితీయ సదస్సులో ఈ పురస్కారాన్ని అందజేస్తారని తెలిపింది. ఈ మేరకు కేంద్ర గనుల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి వీణాకుమారి డెర్మల్ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ (గనుల విభాగం) గోపాలకృష్ణ ద్వివేదికి రాసిన అధికారిక లేఖలో పేర్కొన్నారు. ఈ పురస్కారం రావడానికి కృషి చేసిన గోపాలకృష్ణ ద్వివేది, గనుల శాఖ రాష్ట్ర సంచాలకులు విజి వెంకటరెడ్డిని రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభినందించారు.

గోపాలకృష్ణ ద్వివేది

గిరిజనులకు చంద్రబాబు చేసింది శూన్యం : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు హయాంలో గిరిజనులకు తీరని అన్యాయం జరిగిందని, గిరిజనులకు టిడిపి చేసింది శూన్యమని వైసిపి ఎమ్మెల్సీ కుంభా రవి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 14 ఏళ్లపాటు అధికారంలో వున్న చంద్రబాబు.. గిరిజనుల కోసం ఏమి చేశారో చెప్పలేక అసత్యాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గిరిజన కార్పొరేషన్ వేయాలన్న ఆలోచన కూడా ఆయనకు రాలేదని విమర్శించారు. చంద్రబాబు హయాంలో మంత్రివర్గంలో గిరిజనులకు ఎందుకు అవకాశం కల్పించలేదని ప్రశ్నించారు. సిఎం జగన్.. మూడు లక్షల 26 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చారని, చంద్రబాబు ఎన్ని ఎకరాలకు పట్టాలిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు మెడికల్ రీసెర్చ్ యూనిట్ ఏర్పాటుచేస్తున్న ఘనత సిఎం జగన్‌దేనని అన్నారు. పోలవరంలో భూములు కోల్పోయిన గిరిజనులకు చంద్రబాబు అన్యాయం చేశారని విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి

ప్రజాశక్తి-పూసపాటిరేగ (విజయనగరం జిల్లా)

ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ ఢీకొని అన్నదమ్ములు మృతిచెందిన ఘటన విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని పేరాపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని గొల్లపేటకు చెందిన నక్కాన రాము, ఆదిలక్ష్మి దంపతుల కుమారులు సురేష్ కుమార్ (26), రమేష్ కుమార్ (24) సంక్రాంతికి స్వగ్రామం వచ్చి, ఎరుకొండ నుంచి ఆదివారం తెల్లవారుజామున బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. పేరాపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారి అప్రోచ్ రోడ్డుపై ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో అక్కడికక్కడే అన్నదమ్ములు మరణించారు.

इंडियन बैंक Indian Bank इलाहाबाद ALLAHABAD **ఇండియన్ బ్యాంక్**
చందర్లపాడు బ్రాంచ్, ఎన్.టి.ఆర్. జిల్లా.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(4) ప్రకారం (సెక్యూరిటీ ఇంటరెస్ట్ యొక్క రూల్-8(1) (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002 ప్రకారం)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, సెక్షన్ 13(2)లోని 3వ నిబంధనలను అనుసరించి **ఇండియన్ బ్యాంక్** యొక్క అధీకృత అధికారికి సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ **ఋణగ్రహీత : శ్రీ ఇస్మాయిల్ ఖాన్ & సహ-ఋణగ్రహీత : శ్రీమతి సయీద అతహర్,** డి.నెం.28-107, చిన్న మసీదు సెంటర్, నందిగామ, ఆంధ్రప్రదేశ్-521185. **హామీదారులు : 1) శ్రీ ఫైజుల్లా ఖాన్, 2) శ్రీ ముజుబుర్ రెహమాన్ అలీ ఖాన్ & 3) శ్రీ మొహమ్మద్ ముక్తర్ ఆలీ ఖాన్,** డి.నెం.28-107, చిన్న మసీదు సెంటర్, నందిగామ, ఆంధ్రప్రదేశ్-521185 **హోమ్ లోన్ అకౌంట్ నెం.6321867986** వారు నోటీసు ప్రకారం చెల్లించవలసిన బకాయి సొమ్ము **రూ.20,21,985/- (అక్షరాల ఇరవై లక్షల ఇరవై ఒక్క వేల తొమ్మిది వందల ఎనభై ఐదు రూపాయలు మాత్రమే) మరియు తేది.30.10.2023** నుండి తిరిగి చెల్లించే తేదీ వరకు భవిష్య వడ్డీ మరియు కాస్ట్సుతో కలిపి ఈ నోటీసు అందిన 60 రోజులలోగా **చందర్లపాడు బ్రాంచ్** వారికి తిరిగి చెల్లించవలసినదిగా **తేది.30.10.2023** న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.

బకాయి సొమ్ము చెల్లించుటలో ఋణగ్రహీత(లు) విఫలమైనందున సదరు చట్టం సెక్షన్ 13(4)తో పాటు రూలు 8 మరియు 9 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని దిగువ సంతకందారు **తేది.18.01.2024** న స్వాధీనం తీసుకోవడమైనదని ఆస్తి ఋణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా **తేది.18.01.2024 నాటికి బకాయి సొమ్ము రూ.20,20,450/- (అక్షరాల ఇరవై లక్షల ఇరవై వేల నాలుగు వందల యాభై రూపాయలు మాత్రమే) మరియు తేది.19.01.2024** నుండి దానిపై తదుపరి వడ్డీ, కాస్ట్స్, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులకు **ఇండియన్ బ్యాంక్, చందర్లపాడు బ్రాంచ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఆస్తి ఋణగ్రహీత(లు)కు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమైనది.

షెడ్యూలు ఆస్తి వివరములు

శ్రీ ఇస్మాయిల్ ఖాన్, తండ్రి. అహ్మద్ ఖాన్ గారి పేరున గల తనఖా ఉంచబడిన ఆస్తులు
కృష్ణా జిల్లా, నందిగామ, జానకి రామయ్య కాలనీ, వార్డు నెం.27, నందిగామ యొక్క ఆర్.ఎస్.నెం.524/1, డి.నెం.27-4ఎ దగ్గర 260.70 చ॥లు విస్తీర్ణంలోని ఆర్‌సిసి రూఫ్ సింగిల్ స్టోర్డ్ భవనం. **హద్దులు : తూర్పు** : శ్రీ మాజేటి సూర్య ప్రకాష్ రావు గారి స్థలం, **దక్షిణం** : శ్రీ మహంకాళి శంకర్ రావు గారి స్థలం, **పడమర** : శ్రీ బలుసుపాటి నాగేశ్వర రావు గారి స్థలం, **ఉత్తరం** : బజార్.

తేది : 18.01.2024
ప్రదేశం : చందర్లపాడు
సం/-అధీకృత అధికారి
ఇండియన్ బ్యాంక్

వరికపూడిశెలపై మోసగించిన వైసిపి

● ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలంలో ధర్నా

ప్రజాశక్తి- మాచర్ల (పల్నాడు జిల్లా)

వరికపూడిశెల ప్రాజెక్టు విషయంలో పల్నాడు ప్రాంత ప్రజలను వైసిపి ప్రభుత్వం దారుణంగా మోసగించిందని టిడిపి, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. పల్నాడు జిల్లా దుర్గి మండలంలోని ఎత్తిపోతల పథకం నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని వారు ఆదివారం పరిశీలించి అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి.ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికలకు ఆరు నెలలకు ముందు చేసే వాగ్దానాలన్నీ అబద్ధాలంటూ గత ఎన్నికలప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారని, అలాంటప్పుడు వరికపూడిశెల ప్రాజెక్టుకు ఎన్నికల ముందు ఆయన శంకుస్థాపన చేయడాన్ని ఏమనాలని ప్రశ్నించారు. కరువు మండలాలైన వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, ప్రకాశం జిల్లాలోని రెండు మండలాలకు తాగు, సాగు నీరందించే ఈ ప్రాజక్టును టిడిపి అధికారంలోకి వచ్చాక నిర్మిస్తామని హామీ ఇచ్చారు. టిడిపి మాచర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టును నిర్మించకుంటే ఎన్నికల్లో ఓట్లు అడగను, ఎన్నికల్లో నిలబడను అని గత ఎన్నికల సందర్భంలో ప్రస్తుత ఎమ్మెల్యే వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఆయనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సిపిఎం నాయకులు కె.హనుమంతరెడ్డి మాట్లాడుతూ శిలాఫలకాలతో ప్రజలను మోసం చేయొద్దని, పనులను సత్వరమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు సాధనకు ఎన్నో ఏళ్లుగా సిపిఎం, ఇతర సంఘాలూ పోరాడుతున్నాయని గుర్తు చేశారు. పరిశీలనలో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఎరిక్సన్ బాబు, దుర్గారావు, శివారెడ్డి, సీతారెడ్డి, కోటా నాయక్, హరి, రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలంలో ధర్నా చేస్తున్న నాయకులు

రజకుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం

● ఎపి రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి - మాధవధార (విశాఖపట్నం)

రజకుల సమస్యల పరిష్కారానికి రానున్న కాలంలో పెద్ద ఉద్యమం చేపట్టనున్నట్టు ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య తెలిపారు. 'సాంఘిక భద్రత, సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు' అన్న అంశంపై ఆదివారం విశాఖ కంచరపాలెంలోని బొట్టా నర్సింగరావు భవన్‌లో ప్రాంతీయ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ రజకుల పట్ల దాడులు, దౌర్జన్యాలు, మహిళల పట్ల అత్యాచారాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో రజకులకు ఒరిగిందేమీ లేదన్నారు. రజకుల భద్రత కోసం ఎస్‌సి, ఎస్‌టి అట్రా సిటీ చట్టం లా సామాజిక భద్రతా చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేసి రజక యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరి ఇస్త్రీ చేసే రజక వృత్తిదారులకు 250 యూనిట్ల ఉచిత కరెంటు ఇవ్వాలని, పట్టణ కేంద్రాల్లో మోడ్రన్ దోబీ ఘాట్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు పూర్తయిన వారికి రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, దోబీ ఘాట్ స్థలాలు, రజక వృత్తి చెరువులపై పూర్తి హక్కులు రజకులకే కల్పించాలని కోరారు. రజక కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో ప్రతి కుటుంబానికీ రూ.లక్ష రుణం ఇవ్వాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. భవిరిశెట్టి ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరపు ఈశ్వరరావు, వల్లూరి ధనకోటి వెంకట పూర్ణచంద్రరావు, మఠం విజయ్‌రావు, భైరవశెట్టి ఆనందరావు పాల్గొన్నారు.

భారీగా నగదు పట్టివేత

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద ఆదివారం తెల్లవారుజామున ఓ కారులో భారీగా తరలిస్తున్న నగదును పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. వేంపాడు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. తుని వైపు నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా అందులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి వద్ద ఉన్న ఐదు బ్యాగులను పరిశీలించగా అందులో రూ.2.7 కోట్ల నగదు పట్టుబడింది. ఆ నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలూ చూపకపోవడంతో నగదును, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న వారు శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం ప్రాంతానికి చెందిన వారని తెలిపారు.

UNITY Small Finance Bank **యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**
కార్పొరేట్ కార్యాలయం : సెంట్రోమ్ హౌస్, విద్యానగరి మార్గ్, కలిన, శాంతాక్రూజ్ (ఈ), ముంబై-400098

లాంఛనప్రాయ స్వాధీనతా నోటీసు
(రూల్ 8(1) చూడండి (స్థిరాస్తుల కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన **యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ సదరు నోటీసు రసీదు తేది నుండి 60 రోజులలోగా మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా రుణగ్రహీత/సహ రుణగ్రహీతలు/హామీదారులను పిలువడం జరిగింది.
రుణగ్రహీత/సహ రుణగ్రహీతలు/హామీదారులు పేర్కొన్న మొత్తమును తిరిగి చెల్లించడంలో విఫలమైనందువల్ల, రుణగ్రహీత/సహ రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పేర్కొన్న చట్టం యొక్క రూల్ 8 తో చదువుతూ సెక్షన్ 13 (4) క్రింద దిగువసంతకందారు తనకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ క్రింద తెలిపిన ఆస్తిని **19.01.2024**న స్వాధీనం చేసుకోవడమైనది.
ముఖ్యంగా రుణగ్రహీత/సహ రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తి (స్థిరాస్తి వివరణ) తో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌కు మొత్తం మరియు దానిపై వడ్డీ, ఖర్చులు చెల్లించి జరుపవచ్చు.
రుణగ్రహీత/సహ రుణగ్రహీతలు/హామీదారులు జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

రుణగ్రహీత/సహ రుణగ్రహీతలు/హామీదారులు పేరు మరియు లోన్ ఎకౌంట్ నంబరు	సెక్యూర్డ్ అసెట్స్/తనఖా ఆస్తుల వివరణ	డిమాండ్ నోటీసు తేది మరియు బకాయి మొత్తం
1. సిరి డయోగ్నొస్టిక్స్, 2. శ్రీమతి. శైలజ మేకకోటి, 3. శ్రీ.ఎమ్.రవిబాబు **లోన్ ఎకౌంట్ నం.:** USFBVJWLOAN 000005007992	బాపట్ల జిల్లా, బాపట్ల ఆర్ఓ, ఏతేరు గ్రామ పంచాయతీ మరియు గ్రామంలో ఉన్న స్థిరాస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.465 విస్తీర్ణం 96.8 చ.గ.లు. సైట్‌తో ఆర్‌సిసి భవనం బేరింగ్ డో.నం.1-138ఎ, మూల్యాంకనం నం.149, హద్దులు : **సరిహద్దులు** : (తనఖా డాక్యుమెంట్ ప్రకారం) **ఉత్తరం** : పంచాయతీ రోడ్డు, **దక్షిణం** : కలింత సంతోషమ్మ సైట్, **తూర్పు** : మద్దు అర్జున రావు ఇంటి సైట్, **పడమర** : పంచాయతీ రోడ్డు.	డిమాండ్ నోటీసు తేది : **06.11.2023, 03.11.2023** నాటికి మొత్తం **రూ.12,88,404.20/-** (పన్నెండు లక్షల ఎనభై ఎనిమిది వేల నాలుగు వందల నాలుగు రూపాయల ఇరవై పైసలు మాత్రమే) ప్లస్ వర్తించే వడ్డీ మరియు ఇతర ఛార్జీలు.

తేది: 21.01.2024
ప్రదేశం: గుంటూరు (ఆంధ్రప్రదేశ్)
సం/- (అధీకృత అధికారి)
యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

MOTILAL OSWAL HOME LOANS
మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
సిఐఎన్ నంబర్ : U65923MH2013PLC248741
కార్పొరేట్ ఆఫీసు: మోతిలాల్ ఓస్వాల్ టవర్, రహిమ్‌తుల్లా సయాని రోడ్డు, పారెల్ ఎస్‌టి డిపోట్ ఎదురుగా, ప్రభాదేవి, ముంబయి-400025. **ఇ మెయిల్ : hfquery@motilaloaswal.com**
శాఖా కార్యాలయం : 2వ అంతస్తు, 59-13-2/1, గాయత్రి నగర్, ఘంటసాలవారి వీధి, పాలిటెక్నిక్ పోస్ట్, విజయవాడ-520008, ఆంధ్రప్రదేశ్. **సంప్రదించాల్సిన నం.: పివిఆర్ సుబ్రమణ్యం-9372705039**

ఇ-వేలం కం విక్రయం కొరకు బహిరంగ ప్రకటన

సెక్యూరిటీ ఇంట్రస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 మరియు 9 నియమాలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తు(ల) అమ్మకం కొరకు 15 రోజుల ఇ-వేలం విక్రయ నోటీసు
సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు హామీదారులకు నోటీసు ఇవ్వడమేమనగా, సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టిన/ఛార్జ్ చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తులు ఏవైతే, మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది) యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకోబడింది. దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలు మరియు హామీదారుల నుండి **మోతీలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** (గతంలో అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది)/ సెక్యూర్డ్ క్రెడిటర్‌కు బకాయిని రియలైజేషన్ తేదీ వరకు ఇందు దిగువ పేర్కొన్న బకాయిలు మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఇతర వ్యయాలను రికవరీచేయుట కొరకు, ఇందు దిగువ పేర్కొన్న తేదీ మరియు సమయంన **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది. రిజర్వు ధర, ధరావత్తు (ఇఎండి) మరియు ధరావత్తు డిపాజిట్‌చేయుటకు చివరి తేది ఇందు దిగువ కూడా పేర్కొనబడినవి:

రుణగ్రహీత(లు)/హామీదారు(లు)/ లోన్ ఎకౌంట్	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్థిరాస్తి వివరణ	రిజర్వు ధర, ఇఎమ్‌డి మరియు ఇఎమ్‌డి సమర్పణకు చివరి తేది	ఇ-వేలం తేది మరియు సమయం
ఎల్ఏఎన్ : LXVIJ00317-180067047 శాఖ : విజయవాడ రుణగ్రహీత : వరప్రసాద్ సీతారామయ్య హరి, సహ రుణగ్రహీత : సీతారామయ్య కృష్ణమూర్తి హరి	**17-02-2020 కొరకు రూ.16,30,478/-** (పదహారు లక్షల ముప్పై వేల నాలుగు వందల డెభ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే)	గ్రౌండ్ ఫ్లోర్, హౌ.నం.14-7/18/1, ఎస్‌టి.ఎస్.నం.1006/1, వార్డు నం.8, బ్లాక్ నం.33, హనుమాన్ పేట, విజయవాడ, కృష్ణ, విజయవాడ (అర్బన్), ఆంధ్రప్రదేశ్-520002.	రిజర్వు ధర: రూ.9,00,000/- (తొమ్మిది లక్షల రూపాయలు మాత్రమే) / ఇఎమ్‌డి : రూ.90,000/- (తొంభై వేల రూపాయలు మాత్రమే) / ఇఎమ్‌డి డిపాజిట్ చివరి తేది : 10-02-2024	**12-02-2024,** సమయం: ఉ.11.00 గం. నుండి 11.30 గం. (ప్రతిసారి 5 నిమిషముల అపరిమిత పొడిగింపులతో)

ఇ-వేలం షరతులు మరియు నియమాలు :
1. వేలం బిడ్ పత్రం యొక్క తదుపరి నియమాలు మరియు షరతుల ప్రకారం మరియు దానిలో ప్రవేశపెట్టిన విధానం ప్రకారం నిర్వహించబడుతుంది. బిడ్డరుదారులు బిడ్ పత్రాలు, ఇ-వేలంలో పెట్టబడు సెక్యూర్డ్ అసెట్ వివరాలు మరియు బిడ్‌ఫారం ఏదైతే ఆన్‌లైన్ దాఖలుచేయబడునో దాని కొరకు బిడ్డరుదారులు వెబ్ పోర్టల్ : **https://BestAuctionDeal.com** ను సందర్శించగలరు. ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్: **M/s. GlobeTech Infosystems Private Limited** ద్వారా వెళ్లవచ్చు. ఆసక్తి గల కొనుగోలుదారులు అదే పోర్టల్‌లో వేలం నిబంధనలు మరియు షరతులు మరియు ప్రక్రియ ద్వారా వెళ్లవచ్చు మరియు **పివిఆర్ సుబ్రమణ్యం-9372705039** సంప్రదించవచ్చు. పైన పేర్కొన్న వివరాలు వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయి మరియు వారి కేంద్ర హెల్ప్ లైన్ డెస్క్ : +91 98100 89933, +91 124 44 70 855, ఇ మెయిల్ ఐడి : **Care@BestAuctionDeal.com** సంప్రదించవచు.

ప్రదేశం: విజయవాడ
తేది: 22.01.2024 *అనువాదంలో వ్యత్యాసం ఉన్నట్లయితే, ఇంగ్లీష్ వర్షన్‌ను పరిగణించగలరు.
సం/-
అధీకృత అధికారి,
(మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్)

Chola Enter a better life
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: చోలా క్రెస్ట్, సూపర్ బి, సి54 మరియు సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (రూల్స్) మరియు సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్స్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 ("చట్టం") యొక్క నిబంధనల క్రింద
కింద సంతకం చేసిన **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క ఆధీకృత అధికారి (సెక్యూర్డ్ క్రెడిటార్) చట్టంలోని సెక్షన్ 13(12) కింద అందించబడిన అధికారాలను అమలు చేసూ, నిబంధన 3తో చదివిన సెక్షన్ కింద డిమాండ్ నోటీసు(లు) జారీ చేయబడింది. చట్టంలోని 13 (2) పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి **60 రోజులలోపు** సంబంధిత నోటీసు (ల)లో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత(లు)ని పిలవడం జరిగింది. రుణగ్రహీత (లు) డిమాండ్ నోటీసు (ల) సేవలను తప్పించుకుంటున్నారని/ నివారిస్తున్నారని దిగువ సంతకం చేసిన వారు సహేతుకంగా విశ్వసిస్తున్నారు. కాబట్టి నిబంధనల ప్రకారం అనుబంధం చేయడం మరియు ప్రచురించడం ద్వారా నోటీసు సేవ ప్రభావితమవుతుంది. డిమాండ్ నోటీసు(ల)లోని విషయాలు ఇక్కడ దిగువన సంగ్రహించబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు మరియు చిరునామా	రుణం మొత్తం	డిమాండ్ నోటీసు తేది మరియు బాకీపడిన మొత్తం	సెక్యూర్డ్ అసెట్/ ఆస్తి వివరాలు
1.	రుణ ఖాతా నెం. X0HLVJI00002211286 1) పోతంశెట్టి నరసింహారావు, 2. గుండెబొమ్మ లక్ష్మి **ఇరువురి నివాసం:** డో.నం.67-1-11, దర్శిపేట, పటమట, విజయవాడ, కృష్ణ-520 010, ఆంధ్రప్రదేశ్; **ఇక్కడ కూడా :** డో.నం.67-1-11, దర్శిపేట, పటమట, విజయవాడ ఎన్ఎస్ఎమ్ స్కూల్ రోడ్డు, కృష్ణ-520 010, ఆంధ్రప్రదేశ్.	₹ 25,00,000/-	17.01.2024 **రూ.25,12,428/-** (ఇరవై ఐదు లక్షల పన్నెండు వేల నాలుగు వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) **13.01.2024** నాటికి	ఎన్‌టిఆర్ జిల్లా (పాత కృష్ణాజిల్లా), విజయవాడ జిల్లా రిజిస్టర్ కార్యాలయం, పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, పటమట బేరింగ్ ఆర్.ఎస్.నం.64/1, 64/2, డో.నం.67-1-11 విస్తీర్ణం 113.71 చ.గ.లు. ఆ జి+1 భవనం ఉన్న **హద్దులు : ఉత్తరం** : మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, **దక్షిణం :** షేక్ సిద్దబాబు ఆస్తి, **తూర్పు** : వై.అచ్చుమ్మ ఆస్తి, **పడమర :** జి.లక్ష్మి ఆస్తి తో అన్నీ సౌలభ్య హక్కులు.

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు (లు)కు కట్టుబడి ఉండాలని మరియు ఈ ప్రచురణ తేదీ నుండి **60 రోజులలోపు** వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, ఖర్చులు మరియు ఖర్చులతోపాటు అందులో పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని చెల్లింపు యొక్క సాక్షాత్కార తేదీ వరకు చెల్లించాలని దీని ద్వారా సూచించారు. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సురక్షిత రుణదా అని మరియు రుణగ్రహీత (లు) పొందే రుణ సదుపాయం స్థిరాస్తి/ ఆస్తులు తనఖగా ఉంచిన సురక్షి ఆస్తి (లు)కి వ్యతిరేకంగా సురక్షి రుణం అని రుణగ్రహీత (లు) గమనించవచ్చు. రుణగ్రహీతలు నిర్ణీ గడువులోగా తమ బాధ్యతలను పూర్తి చేయడంలో విఫలమైతే, సురక్షితమైన ఆస్తులు (లు) స్వాధీనం చేసుకోవడానికి చట్టంలోని సెక్షన్ 13 (4) ప్రకారం అన్ని హక్కులను వినియోగించుకోడానికి సురక్షి రుణదాకు అర్హత ఉంటుంది. విక్రయం ద్వారా చట్టం మరియు దాని క్రింద ఉన్న నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కారాన్ని అమలు చేయడం ద్వారా మరియు ద్వారా వాటిని బదిలీ చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా. సురక్షిత రుణదాతకు అమ్మకం లేదా బదిలీ హక్కును అమలు చేయడానికి ముందు సురక్షి ఆస్తులు(లు) **అటాచ్ మరియు/లేదా సీల్** చేయడానికి కూడా అధికారం ఉంది. సురక్షిత ఆస్తుల (ల) విక్రయం ర్వా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి తనఖా పెట్టబడిన ఆస్తుల విలువ సరిపోకపోతే, బ్యాలెన్స్ బకాయిలను తిరిగి పొందటానికి ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఉంది. ఈ పరిహారం అదనంగా మరియు ఏదైనా ఇతర చట్టం ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్‌కు అందుబాటులో ఉన్న అన్ని ఇతర నివారణలకు స్వతంత్రంగా ఉంటుంది.
అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) కి, సురక్షిత ఆస్తులను మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి రుణగ్రహీతల దృష్టిని ఆహ్వానిస్తున్నారు. దీని ద్వారా రుణగ్రహీత (లు) సురక్షిత ఆస్తి (ల)ను పాడు చేయడం లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఏదైనా సురక్షి ఆస్తి(ల) యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా బదిలీ చేయడం నుండి నిరోధించబడింది/ నిషేధించబడింది సెక్యూర్డ్ క్రెడిటార్ మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ కింద సంతకం చేసిన వారి వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీత (లు) వారు కోరుకున్నట్లయితే, సాధారణ కార్యాలయ వేళల్లో ఏదైనా పని దినాన దిగువ సంతకం చేసిన వారి నుండి సేకరించుకోవచ్చును.

ప్రదేశం: విజయవాడ, ఆంధ్రప్రదేశ్
తేది: 17.01.2024
సం/-
మెసెర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్. తరఫున అధీకృత అధికారి

“తెలుగు నాట భక్తిరసం
తెప్పలుగా పారుతోంది
డ్రయినేజీ స్కీము లేక
డేంజరుగా మారుతోంది.”

– గజ్జెల మల్లారెడ్డి

అతడూ - నేనూ

అతడు చిద్విలాసంగా నా వైపు చూసి తలేగరేశాడు
“చూశావా, ఒక మహత్యంలా ఎలా జరిగిపోతుందో ...
ఉన్నాడో లేడో అన్నావు
ఇక కళ్లకు కట్టే సమాధానం దొరికినట్టే కదా?” అన్నాడు.

నేనూ నవ్వాను.

“ఇంకా అదే అంటావా?” అన్నాడు
అనుమానంగా, ఆశ్చర్యంగా.

“అవును
ఇంకా గట్టిగా అంటాను
మనుషులు ఎంత గొప్పవాళ్లో
లోకం మరింత స్పష్టంగా
తెలుసుకుంటుంది ఇప్పుడు” అన్నాను.

అతడు అయోమయంగా చూశాడు
“ఆ ఘనతంతా ఆ దేవదేవుడిదే కదా” అన్నాడు.

“కాదు, నీది !
నీలాంటి కోట్లాదిమందిది
పునాదులు తవ్విన శ్రామికులది
రాళ్లు పేర్చిన కూలీలది
ప్రణాళికలు కూర్చిన విజ్ఞానులది
రాళ్లను తవ్వి తీసిన కార్మికులది
ఎక్కడెక్కడినుంచో అక్కడికి తరలించిన
అనేకానేక మంది శ్రమ జీవులది
రాయి రాయి ఏర్చి కూర్చి నిర్మించిన
సాధారణ శ్రామిక జనావళిది
రాత్రీ పగలూ శ్రమించి చెక్కిన శిల్పులది
హంగులూ రంగులూ అద్దిన కళాకారులది
నిపుణులది, నిర్మాణకర్తలది
ఘనతంతా మనుషులది..
అందరూ అన్నీ చేయడం వల్లే
దేవదేవుడు ఇప్పుడు అక్కడున్నాడు ..
అప్పుడు చెప్పిందే ఇప్పుడూ చెబుతున్నాను
ఏదైనా మనుషులే చేస్తారు, చేయగలరు” అన్నాను.

అతడు, నా మిత్రుడే ...
అప్రసన్నంగా చూశాడు నా వైపు!

“ఇంత చేసిన ఘనత మాత్రం
ఖచ్చితంగా మా నాయకుడిదే కదా!” అన్నాడు గర్వంగా.

“ఘనతో కాదో చెప్పలేను కానీ,
సొంత లబ్ధి కోసం సొంతం చేస్తున్నది
ఖచ్చితంగా మీ నాయకుడే!
జనం ఉద్వేగాలను పల్లకీగా మల్చుకొని
అందులో ఊరేగాలనుకుంటున్నది
ఖచ్చితంగా మీ నాయకుడే!
పూర్తి కాని దేవళంలో
హడావిడి ప్రతిష్టాపనం
మళ్లీ అధికారం కోసమే కదా
ఈ అట్టహాస ప్రహసనం?” అంటూనే ఉన్నాను
అతడు వింటూనే విసుగ్గా వెళ్లిపోయాడు!
విగ్రహంలోని దేవుడు
ఎప్పటిలాగానే అవాక్కై నించున్నాడు!

– చింతపల్లి శ్రీరామ్

నిన్ను వెంటాడుతూనే ఉంటుంది

ఆమె రోజూ పసిపిల్లల
ఆలనా పాలనా చూస్తూ పొద్దుపుచ్చుతుంది
బహుశా తన పిల్లలకు ఎంత సమయం ఇస్తుందో
తెలియదు
అంగన్వాడీ పిల్లలే తన లోకమంతా
ఇంటిపనులూ, అత్తమామల సపర్యలూ
పిల్లలను తయారు చెయ్యటాలూ పూర్తి చేసుకుని
ఇన్ని హడావుడిల మధ్య ఏం తినో ఏం తినకో
ఆదరా బాదరాగా అంగన్వాడీ డ్యూటీని
ఆలింగనం చేసుకుంటుంది

ప్రపంచీకరణ అభివృద్ధి మెరుపుల మధ్య
పైపైకి పోతున్న నిత్యావసర ధరల గాలిపటాన్ని
అందుకోవటానికి కుటుంబమంతా రెక్కలు
ముక్కలు చేసుకునే కాలం
ఇంటిపెద్ద చాలీచాలని సంపాదనకు
తోడుగా కుటుంబానికి ఆదాయం అయ్యింది
అందుకు అంగన్వాడీ ఉద్యోగం ఓ ఆసరా
అయ్యింది
ఇంటిపనీ అంగన్వాడీ పనీ
రెంటి మధ్య నలుగుతూ
ఎంత కష్టాన్నయినా పంటిబిగువున భరిస్తుంది

పెరిగిన ఖర్చులు, ఎదుగుతున్న పిల్లలు
వేతనం పెంచమని అడిగేలా చేసాయి
అట్టడుగున పనిచేసే అంగన్వాడీకి
నువ్వు కనీసవేతనం ఇవ్వకపోవడం నేరం

వారి నిరసనలో న్యాయం ఉంది
నీ నిరాకరణలో ద్రోహం ఉంది.
అందుకే ఆమె ఆందోళనా కెరటమయ్యింది
పోరాట కేతనమయ్యింది
నెలరోజులు దాటినా వెనుకడుగేయక
సమ్మె చేస్తున్న ఆమె పోరాట స్ఫూర్తి మీ
కర్థంకావట్లేదా?
నువ్వు చేసిన ద్రోహం
చరిత్రలో నిక్షిప్తమై నిన్ను వెంటాడుతూనే
ఉంటుంది!
ఆమె అలుపెరగని పోరాటం
నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుంది!

– వొరప్రసాద్

నాకు స్వేచ్ఛ కావాలి!

నేను అలసిపోయాను!
నిన్న రాత్రి నేను పడుకోలేకపోయాను
కానీ నేను ఎప్పటికో నిద్రపోయాక
నా కలలో నేను వినగలిగిందంతా బాంబుల
శబ్దాలే
అదో పీడ కల
అంత దుర్మార్గంగా ఎలా ఉండగలరో..
అమాయకపు పిల్లలను, ప్రజలను
అమర జీవులుగా మార్చే క్రూరులుగా ఎలా
అయ్యారు?!
మేము తెలుసుకోవాలని అనుకోవడం లేదు.
తర్వాత బాంబులెక్కడ పడతాయని..
నా చిన్ని తమ్ముడిని కాపాడుకోవాలని
ప్రయత్నిస్తూ..
నా గది మూలాన ముడుచుకుపోయాం..
భవనం దెయ్యం పట్టినట్లు కంపిస్తోంది..
కానీ.. అణచివేతకు గురి అయిన మేము
తిరిగి నిలబడిన సంకల్పం కంటే బలమైనదేమీ
కాదు..
నా రాతలతో, మాటలతో
నేనూ తిరిగి బాంబులు వేస్తాను..
పాలస్తీనాను విచ్ఛిన్నం చేయడానికి
ప్రయత్నిస్తున్న కాలంలో జీవిస్తున్నా..

అసలు నా తలపై
కదలాడుతున్న మేఘాల్లో ఏమి దాగుందో..
మా నాన్న ఒక్క రొట్టె ముక్క కొనడం కోసం
అతని ప్రాణాలను పణంగా పెడుతున్నారు..
నా 12 ఏటలో.. ఇది నాలుగో యుద్ధం..
ఈ దశలో నేను ఇంకా మోడుబారిపోయాను..
లేదు.. అసలు నాకు భయం అనే భావనే
కలగలేదు..
నేను చేయడానికి ఏమీ లేదు..
సురక్షితంగా ఉండే సందర్భంలో నేను ధైర్యంగానే
ఉన్నా..
ఒకవేళ ఈ ఇల్లే నా సమాధి కావొచ్చేమో!
నాకు కావాల్సింది.. నా పాలస్తీనా ప్రజలకు
స్వేచ్ఛ
20 లక్షల మంది ఖైదీలు ఈ ప్రదేశంలో
నివసిస్తూ
నినదిస్తున్నారు గోడలు ప్రతిధ్వనించేలా..
కానీ.. మార్పు ఏమీ లేదు.. ఈ ప్రాంతంలో
జీవితం ఇది..
మాతృమూర్తులు భయంతో దుఃఖిస్తున్నారు
తెల్లని పరదాలు
వీధిన కుప్పలుగా పడి ఉన్న దేహాలపై
కప్పబడ్డాయి..
భవనాలు బూడిదగా మారాయి..
కానీ.. నా మనసు ఉక్కుతో చేయబడింది
అందుకే ఎక్కువ సమయమేమీ పట్టదు
కోలుకోవడానికి
మన మనసు ఎన్నడూ జీవించాలనే శక్తిని
కోల్పోవద్దు
మా ఆంటీ తన ఇంటిని, జీవితాన్ని కోల్పోయినా
బతికే ఉన్నారు..
కానీ ఈ ఎగిరి పడ్డ బాంబుల వల్ల
గాయపడ్డారు..
ఆ రాత్రి
మా చెల్లి నిద్రపోలేకపోయింది
తన ఏడుపుని ఆపడానికి ప్రయత్నిస్తూ
ఆ శబ్దాలన్నీ టపాసులవని అబద్ధం చెప్పాను..
ఎక్కడ ఉంది కరుణ?
ఇదంతా నిర్దయత్వం.. అమానుషం..
వాళ్లకి మేమందరం చీకటిలో బతకాలి
గంటల తరబడి నీరు..
ఇంకా విద్యుత్తు సదుపాయాలు నిలిపివేస్తున్నారు
వాళ్ళు కోటల్ని కూలుస్తున్నారు..
కానీ.. అది నా కలానికి ఉన్న సామర్థ్యాన్ని
కూల్చలేదుగా..
రాస్తున్నప్పుడు నేను అజేయుడను..
శబ్ద ప్రసారాన్ని ఒక్కటే తప్పించుకోడానికి
మార్గం..
ఎందుకంటే ఆ విధంగానే నేను
నా మనసులోనిది మాట్లాడగలను..
నేను ఆశ్చర్యపడతాను.. అస్సలు అలా ఎలా?
ఒక యుద్ధం చేసేవాడు రాత్రుళ్ళు
నిద్రపోతున్నట్లు నటిస్తాడో..
అతను ఒక నగరాన్ని అంతలా.. అతలాకుతలం
చేశాడో తెలిసి
ఆ ఒక్క బటన్ నొక్కడంతో..
అకస్మాత్తుగా ఎన్ని కుటుంబాలు ఊచకోతకు
గురవుతాయో..?!
20 లక్షల మంది ఖైదీలు ఈ ప్రదేశంలో
నివసిస్తూ..
నినదిస్తున్నారు గోడలు ప్రతిధ్వనించేలా..
కానీ.. మార్పు ఏమీ లేదు..
ఈ ప్రాంతంలో జీవితం ఇది..
నాకు కావాల్సింది.. నా పాలస్తీనా ప్రజలకు
స్వేచ్ఛ!

గాజా బాలుని గేయానికి అనువాదం
డాక్టర్ నవ్యశ్రీ

మా ఇంటి తోరణాలు

తల్లిగర్భం దాల్చిన నుంచి
వారి సంరక్షణకై
నీడలా వుంటారు
వారు ఆకలితో పస్తులున్నా
ఇంటింటి గుమ్మం ముందు
వారు చూపులు
పసి పిల్లల నవ్వులకై
ఎదురు చూస్తుంటాయి
ఊరు జనం పిల్లల్ని
తల్లుల్లా అంగన్వాడీలో
సాకుతారు
ప్రతి బిడ్డా
పౌష్టికాహారం, ఎదుగుదలకు
ఇంటింటా కాకిలా కబురు
మోసుకెళ్తారు

టీకాలు దగ్గర నుంచి
ఓటరు జాబితాల దాకా
వీరు తొక్కని గుమ్మంలేదు

వీరు సంతకం
ఇంటికి మామిడి
తోరణాలవుతాయి
నిత్యం పసిబిడ్డల సంరక్షణకై
తలపై ముళ్ళకిరీటం మోస్తూ..
క్రీస్తుకు దిగబడిన డొక్కలో
బల్లెంలా
ప్రభుత్వాలతో యుద్ధం
చేస్తున్నారు.

వీరు నేడు
హక్కుల పత్రాల సంతకం
కోసం
పునర్థానమవటానికి
సిద్ధపడుతున్నారు.
అణచివేతలకు కలలు కూలవు
శ్రమశక్తిని చిన్నచూపు చూస్తే
ఆకలి మంటల లావాగ్ని
పాలకులను
దహించకమానదు.
అమ్మలు, అక్కలు, చెల్లెళ్ళ
కన్నీటి యుద్ధంలో
మీ ఉక్కు చట్టాలు
ధ్వంసమవ్వక తప్పదు
ఆకలికి అన్యాయం చేస్తే
కూలితల్లుల కడుపు కొడితే
పాలకులు మట్టిగొట్టుకు
పోవడం ఖాయం
శ్రమజీవులదే చరిత్ర
భయమెరుగని ఉద్యమాలదే
విజయం!

– తంగిరాల సోని
96766 09234

అంతిమ తీర్పు

శ్రామిక దోపిడీ సహించబోమంటూ
వేలాది కార్మిక పాదాలు
హక్కుల పోరాటాలై కదిలాయి.
ఆకలి ఆకలి అంటూ
పొట్ట చేత పట్టుకుని
లక్షలాది శ్రామిక హస్తాలు
ఉక్కు పిడికిళ్ళై లేచాయి
గృహ నిర్బంధాలంటూ..
ఎస్మా హెచ్చరింపులతో
ఉక్కు సంకెళ్లు మోగుతున్నాయి !
పాదయాత్రలోని ఓట్ల ప్రేమ
పాలనలో పగగా మారిందా?
మాట తప్పి మడమ తిప్పిందా?
హక్కులపై ఉక్కు పాదం
అక్క చెల్లెళ్లపై ఉగ్రరూపం
సుప్రీంకోర్టు తీర్పుల్నే ధిక్కరించి
గర్భిణీలను, బాలింతలను,
చిన్నారులను, వితంతువులను,
వృద్ధ మహిళలను రోడ్డుకీడ్చిన విగ్రహ
స్వరూపం!
అమ్మను, చెల్లిని ప్రేమించలేని వారు
శ్రమశక్తిని ఏమి గౌరవించగలరు?
కానరావే..!?
శ్రమజీవుల బాధలు – జీవన గాధలు
కళ్ళుండీ చూడలేని గుడ్డి పాలన
చెవులుండీ వినలేని చెవిటి పాలన
చేతులుండీ చేయలేని కుంటి పాలన
అంగన్వాడీ బతుకులు
పని బారెడు – జీతం మూరెడు
జీవితమంతా చిరుగుల అతుకులు
చులకనగా, అగౌరవంగా, దొంగలుగా
గుర్తింపులు
ప్రభుత్వ మీటింగులకు
పోటెత్తే జన ప్రవాహం వాళ్లే.
ప్రభుత్వ సంక్షేమ పథకాలకు
అనర్హులూ వాళ్లే ..!?
అధికారుల బెదిరింపులకు,
వేధింపులకు, హత్యలకు
ఆత్మహత్యలుగా వాళ్లే!
నిత్యవసర ధరలు పెరిగి
కుదేలవుతున్న జీవితాలు వాళ్లే!
సామాజిక అవసరాలకు
చాలీచాలని జీతాలుగా వాళ్లే!
మాట్లాడటం నేరం
ప్రశ్నించటం ద్రోహం
పనికి తగ్గ కనీస గౌరవ వేతనం,
గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్,
పెన్షన్ ఈ జీవన భద్రతను కోరడం
ద్రోహం!
వాళ్ల న్యాయమైన హక్కుల కోసం
సమ్మె చేయటం రాజ ద్రోహం !
ఈ కళ్ళే.. గుర్రాలతో తొక్కించిన
రాజ్యాలను మట్టి కల్పించాయి
ఇప్పుడు ఈ కాళ్ళే.. మీ ఎస్మా చట్టాలపై
పోరు బాట పట్టాయి
ఊపిరి పోయినా ఉద్యమం ఆగదు.
సామాన్యుల నోళ్లు కొడితే
కూలేది రాజ్యాలే !
ఎస్మా ప్రయోగీ.. అప్రజాస్వామ్య ఉన్మాదీ..
తస్మాత్ జాగ్రత్త !
వాళ్ళ ఉసురు తగిలి
ప్రభుత్వాల కోట గోడలు కూలేదే
అంతిమ తీర్పు!

– శిఖా – ఆకాష్
9381522247.

కథా సంపుటాలకు ఆహ్వానం

తపన సాహిత్యవేదిక మొదలుపెట్టి 34 యేళ్ళు కావస్తున్న సందర్భంగా ప్రతి సంవత్సరం ఉత్తమ కథల సంపుటాలకు రు.10 వేలు సడ్లపల్లె కథాపురస్కారం ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది. కాబట్టి తెలుగులో అచ్చు వేసిన ఏ ప్రాంతం వారైనా జనవరి 2022 నుంచి డిశంబర్ 2023 మధ్యలో ప్రచురించిన కథా సంపుటాలు 4 ప్రతులను మార్చి 31,2024 లోపు కింది చిరునామాకు పంపగలరు. చిరునామా : సడ్లపల్లె చిదంబరరెడ్డి, 21.6.139, టీచర్స్ కాలనీ, హిందూపురం– 515 211, సెల్ : 94400 73636

విన్నపాలు వినవలె..

ఆయన చెప్పాడంటే చేస్తాడంతే...
అక్కచెల్లెమ్మలకు అండనేనంటే
నమ్మేశామంతే...
విన్నపాలు వినవలెనంటూ మొరపెట్టామెంతో
జీవితాలు నిలబెడతాడని ఆశించామెంతో
పండుగ పూటైనా అన్నలా వరమిస్తాడనుకుంటే
సంక్రాంతి కానుకంటూ ఎస్మా, షోకాజు లొచ్చే...

గుర్రాలతో తొక్కించినా
నీటి పిరంగులు ప్రయోగించినా
అదరని బెదరని గుండెలవి
ఆప్యాయతను పంచే అమ్మలే కాదు...
అపర కాళికలు కూడా...
మాతత్వం, మమకారం పంచగలరు
చీపురు పట్టిన... గరిట తిప్పిన
చేతుల సత్తానూ చూపగలరు...

స్త్రీల సమస్యలు, హక్కులు...
స్త్రీలవి మాత్రమే కాదు.. మొత్తం సమాజానివి
వారి కడుపు పండితే పుడమి పులకిస్తుంది
వారి కడుపు మండితే జగతి జ్వలిస్తుంది
వారి చేతనలో... చరిత్రలో
ఉద్యమాలు చైతన్య స్రవంతులౌతాయి
వారిలో చైతన్యం నిరసన గళమెత్తితే...
ప్రభుత్వాలే అతలాకుతలమౌతాయి

వేగు చుక్కలై... వెలుగు రేఖలై
భవిష్యత్ ఉద్యమాలకు
క్రాంతిధారలై... ప్రగతిగామిలై
మీరు చూపిన మార్గం
మీరు రాసిన నిరసన కావ్యం
మీరు చేసిన ఉద్యమ గానం
శ్రామిక కార్మిక కర్షకోద్యమాలకు
వెలుగుదారి... ఇది రహదారి!

వారి అడుగుల రాపిడిలో
ఆరని చైతన్యం పుడుతుంది
అది ఓదార్పునిచ్చే అమ్మలా వుండాలో
ఉప్పెనలా ఎగసే ఆదిశక్తులవ్వాలో...
తేల్చుకోవాల్సింది మీరే...
మీదే మీదే.... నిర్ణయం మీదే..!

– రాజాబాబు కంచర్ల

నిజాలను చూపించే వెలుగు రేఖలు

పుస్తకం

కవిత్వం సామాజిక అవసరాన్ని బట్టి తన రూపాన్ని మార్చుకుంటూనే ఉంది. వచన కవిత్వంలో కూడా ఎన్నో రకాలైన రూపాలు వచ్చాయి. ఆచార్య ఎన్.గోపి మొదటిసారిగా నానీలు పేరుతో మినీ కవిత్వాన్ని తెలుగు సాహితీ లోకంలోకి తీసుకు వచ్చినప్పుడు అందరూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. అయితే సమకాలీన ప్రపంచ సాహిత్యంలో చూసినప్పుడు మినీ కవితలు అంతటా వ్యాపించాయి. తెలుగులో కూడా రెక్కలు, ట్రుమ్రీలు, రవ్వలు వంటి పేర్లతో సాహిత్యం వెలుగు చూడడం మొదలుపెట్టింది. ఆ క్రమంలోనిదే 2023లో డాక్టర్ ఎన్.ఈశ్వర్ రెడ్డి ప్రచురించిన ‘నాలో నువ్వు’ మినీ కవితలైన ముఖీలతో కూడిన సంపుటి. అంటే ఫేస్‌బుక్‌లో వచ్చిన కవితలకు ‘ముఖీలు’గా పేరు పెట్టాడు.

ఈశ్వర్‌రెడ్డి సాదాసీదాగా ఉండే ఒక విశ్వవిద్యాలయ ఆచార్యుడు. గతంలో ఆయన “కన్నీటి సీమ” కవితా సంపుటి, “మనసు పల్లవి” పాటలు, “నాకు ఒక మనిషి కావాలి” కవితా సంపుటి తీసుకొచ్చారు. ఇప్పుడు “నాలో నువ్వు” గ్రంథం వెలువరించాడు. దాదాపు 180 పుటలున్న ఈ గ్రంథాన్ని ఒక పూటలో చదివేయవచ్చు. కానీ, చదివిన తర్వాత ఇది అనేక రోజులు మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. సమకాలీన సమాజంలో కనిపిస్తున్న అనేక అంశాలను పది వస్తువులుగా కవే వర్గీకరించి, ‘ముఖీలు’ పేరుతో మనకు అందించాడు. ఖచ్చితమైన స్వరంతో ఓటు, ప్రజాస్వామ్యం, రాజకీయం, ఆర్థికం, మతం, నీతిబోధ, విద్య, కుటుంబం, సామాజికత వంటి అంశాలపై 2017 నుంచి 2021 మధ్య రాసిన కవితలివి. వీటిని విస్తృత పరుచుకుంటే గొప్ప గొప్ప కవితా వాక్యాలవుతాయి. ఇలాంటి వాక్యాలు రాయాలంటే ఎవరికైనా గుండె ధైర్యం కావాలి. సమాజంపై స్పష్టత ఉండాలి. తాను ఎటువైపు ఉంటున్నానో తేట పరిచే తెగువ వుండాలి.

75 ఏళ్ల భారత ప్రజాస్వామ్యంలో ఎన్నికలు, ఓట్లు వంటివి పెద్ద ప్రహసనంగా మారాయే గాని మార్పుకు నోచుకోలేదు. అందుకేనేమో కవి “నోట్లాటలో ఓటర్లు సెల్ఫ్ ఔట్లు” అంటాడు ఈ కవి. ఇకనైనా ఈ రాజకీయ కీచకుల చేతిలో నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించమని, ఆ పరాభవం నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడమని కోరడంలో గొప్ప ధ్వని ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో అమ్మడం, కొనడం అనేది సర్వసాధారణమైంది. అయితే ఒకప్పుడు నాయకులు ఓటర్లను కొనేవారు కానీ, ఇప్పుడు కార్పొరేట్ శక్తులే నాయకులను, ఓటర్లను ఇద్దరినీ గంపగుత్తగా కొంటున్నారని చెప్పడం వాస్తవం. ఒకప్పుడు గురజాడ ‘దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్’ అంటే – ఇప్పుడు నాయకులు మాత్రం “మనుషులంటే ఓటర్లోయ్” అని నినాదం ఇస్తుండడాన్ని గమనించమంటాడు ఈశ్వర్ రెడ్డి. ‘నేటి ప్రజాస్వామ్యం ఒక రాచపుండు’ అంటాడు ఆరుద్ర. ఈశ్వర్ రెడ్డి అంతస్థాయిలో మాట్లాడకపోయినా, ఈ దేశంలో సంపన్నులు, సామాన్యులు అనుభవిస్తున్న స్వతంత్రం వేరని, దానికి కారణం ప్రజాస్వామ్యం పరిపక్వత చెందకపోవడమేనని ఆవేదన వ్యక్తం చేస్తాడు. ప్రశ్నించే వారిని చంపుకుంటూ వెళుతున్న ప్రజాస్వామ్య విషఫలాలను చూపిస్తాడు. వ్యవస్థను పీడించేవాళ్ళు రాజుల్లాగా, ప్రశ్నించే వాళ్ళు నేరస్థుల్లాగా చలామణి అవుతున్న ఇది ప్రజాస్వామ్యమా అని ప్రశ్నిస్తాడు. “మనిషిని చంపడానికి ప్రేరేపించే మతం అదే మనిషిని బతికించడానికి పనికి రాకపోతే అది మతమే కాదు” అనే ఘాటైన వ్యాఖ్యలు నేటి ప్రజాస్వామ్యం మతం రంగు పులుముకోవడాన్ని గర్హించడమే, కవిలోని లౌకికతత్వానికి ఈ వాక్యాలు నిదర్శనం.

ఈశ్వర్ రెడ్డి కవితల్లో తాత్వికత కనిపించినా, అది భౌతికవాదంతో కూడిన తాత్వికత. బలమున్నవాడు కొట్టడం, బలంలేని వాడు అరవడం సర్వసాధారణమైన ఈ వ్యవస్థలో కులాన్ని, మతాన్ని, ప్రాంతాన్ని అడ్డం పెట్టుకుని విమర్శించడం ఒక మానసిక బలహీనత అంటాడు.. ప్రతి మనిషి మానవీయ విలువలతో, మానవ సంబంధాలతో వెల్లివిరియాలని కోరుకుంటాడు. అందుకే “ముడుచుకుపోయిన మనసు రెక్కలను తిరిగి సవరించుకోవడం” పండుగ లక్ష్యం అంటాడు. స్వార్థం, సంపదపై విపరీతమైన కోరిక వంటివి మానవత్వాన్ని తుదముట్టించే సాధనాలని చెప్పడం వాస్తవానికి దగ్గరైన ప్రతిపాదన. సమాజాన్ని, మానవత్వాన్ని, సమాజ నిర్మాణాన్ని అర్థం చేసుకునే చదువులు ఈరోజు మృగ్యమైపోతున్నాయి. “ఏమీ తెలియనివాడు అంతా తెలుసు అంటాడు. కొంత తెలుసుకున్నవాడు నాకు కూడా తెలుసు అంటాడు. బాగా తెలిసినవాడు ఏమీ తెలియదు అంటాడు జ్ఞానం స్వభావం అంతే కదా” అని అనడంలో ఎంతో వాస్తవికత ఉంది. నేటి సమాజంలో అదే కనిపిస్తూ ఉంది.

ఈశ్వర్ రెడ్డి సమాజాన్ని చాలా సునిశితంగా పరిశీలిస్తున్నాడు. ఆయన వాస్తవికవాది. అందుకే “శ్రమ నిచ్చెన లాంటిది అదృష్టం జారుడు బల్ల లాంటిది. శ్రమను నమ్ముకుంటే పైకి అదృష్టాన్ని నమ్ముకుంటే కిందికి” అనే వాక్యాలు చెప్పాడు. “పల్లెలు చిక్కి శల్యం అవుతుంటే పట్టణాలు అడ్డంగా బలిసిపోతున్నాయి” అంటాడు. ఆ వాక్యంతో వదిలేస్తే సామాజిక కవి కాడు ఆయన. పండించే వారి కన్నా తినేవారు ఎక్కువవుతున్న సామాజిక వ్యవస్థను కళ్ళ ముందు చూపిస్తాడు. ప్రతి మనిషి ఏదో ఒక పని చేయాలని, సోమరిగా కూర్చోవడం వల్ల ఏ సమాజం బాగుపడదంటాడు ఈశ్వర్ రెడ్డి. “పదునెక్కని మెదడు పాడుబడిన ఇంటితో సమానం” అనడం వెనుక అర్థం అదే. వేమన తత్వాన్ని అనేక సంవత్సరాలుగా బోధించడం వల్ల కావచ్చు, ఆయన కవిత్వంలో తాత్వికత పాలు ఎక్కువగానే కనిపిస్తుంది. నేటి విద్యావ్యవస్థపైన, ఉపాధ్యాయుడి గుణగణాలపైన, విద్యార్థి ఎలా ఉండాలనే అంశం పైన మంచి సూక్తులు రాశాడు. “పాఠానికి పనికిరాని పాండిత్యం ఉండి ఏమి లాభం” అనడం వెనుక విద్యార్థులకు ఎలా బోధించాలో తెలియని అధ్యాపకుల్ని నేరుగా విమర్శకు పెట్టడమే! ఒక గురువు చెప్పిన పాఠం విన్న విద్యార్థుల గుండెల్లో, ఆ గురువుకు జీవితాంతం చోటు ఉంటుందని, ఆ విద్యార్థుల మనసులను నిరంతరం ఉపాధ్యాయుని పాఠాలు గెలికితే, అతడే నిజమైన ఉత్తమ ఉపాధ్యాయుడనే వాస్తవాన్ని చెప్పడం ఈ ఉపాధ్యాయ కవి ప్రత్యేకత. “ఆకతాయిని ఆచార్యుడిగా, అనామకుణ్ణి అంతరిక్ష పరిశోధకుడిగా, అల్లరి వాణ్ణి అద్భుత తత్వవేత్తగా తీర్చగల మహత్తర శక్తి గురువే” అనడం వెనక ఆయనలోని గురుత్వం కనిపిస్తుంది. అకడమిక్ ఇయర్ పాడైపోయిందని, తరగతులు తప్పామని, అధైర్యపడే విద్యార్థులకు మానసిక స్థైర్యాన్ని నూరిపోస్తాడు కవితల్లో. “గతులు తప్పాయని అధైర్య పడకండి కాలసంచిలో ప్రత్యామ్నాయ పుటలు తెరిచే ఉన్నాయి” అనడం వెనుక పాజిటివ్ థింకింగ్ అర్థం చేసుకోవాలి. నేడు చిన్నపిల్లలకు కూడా సెల్ ఫోన్లు ఇచ్చి కాలక్షేపం చేయడాన్ని కవి విమర్శిస్తాడు. పిల్లలు ఏడుపు మాన్పడానికి యూట్యూబ్ భూతాలకు అప్పగించొద్దని, వారి జీవితాన్ని బలి చేయవద్దని సున్నితంగా హెచ్చరిస్తాడు ఈశ్వర్ రెడ్డి.

నైతిక అంశాలపై మాట్లాడేటప్పుడు కవి ఈశ్వర్ రెడ్డి సూక్తులు సూటిగా హృదయంలో చొచ్చుకు పోతాయి. ప్రయత్నం ప్రారంభించడం, దాన్ని కొనసాగించడం వంటి అంశాలపైన భర్తృహరి, వేమన ఎన్నో విషయాలు చర్చించారు. పట్టు పట్టరాదని, మనిషి ఎన్ని ఆటంకాలు గలిగినా తన ప్రయత్నాన్ని కొనసాగించాలని రకరకాల సూక్తులను చెప్పారు. దానికి కొనసాగింపుగా మంచి ప్రయత్నం కూడా చాలాసార్లు విఫలమవుతుందని, అయినా పట్టు బిగించి లక్ష్యం వైపు ప్రయాణిస్తే, ఖచ్చితంగా దాన్ని చేరుకోవచ్చు అంటాడు ఈశ్వర్ రెడ్డి. ప్రపంచీకరణ యుగంలో త్వరగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో మనిషి రకరకాల కుయుక్తులతో ప్రయాణం సాగిస్తున్నారని, అయితే ఈ క్రమంలో పని చేసే వాడిని పనికిమాలినవాడిగా, చేతగాని వాడిగా చూస్తున్నారని చెప్తూ “పనిచేసే వారికి శత్రువులు ఎక్కువ. పని ఎగ్గొట్టే వారికి జబ్బులు ఎక్కువ. జబ్బులకన్నా శత్రువులే నయం కదా” అనడంలో అందరం కష్టపడి పనిచేద్దాం! అనే పిలుపు ఉంది.

సమకాలీన వ్యవస్థలో వస్తున్న మార్పులను ఈశ్వర్ రెడ్డి కళ్ళకు కట్టిస్తాడు. అవి మనిషికి ఉపకరించేవైతే, చైతన్యవంతమైనవైతే, అభివృద్ధికి తోడ్పడేవైతే స్వాగతించాలంటాడు. “పోయిన వాటికై ఏడిస్తే వర్తమానం జారిపోతుంది ఉన్న వాటిని విస్మరిస్తే సంతోషం ఆవిరవుతుంది” అనడంలో అదే అర్థం ఉంది. ఈ ప్రపంచీకరణ రక్కసి ప్రభావంతో పల్లెల్లో పంటలు ఇంకిపోయి, ప్లాట్లు మొలుస్తున్న విధానాన్ని దుయ్యబడతాడు. పచ్చదనం, మొలకెత్తడం అభివృద్ధికి చిహ్నాలు అని సూచిస్తాడు. బూటకపు మాటలు చెబుతూ ‘అచ్చేదిన్’ అంటూ మోసగిస్తున్న నాయకులను సూటిగా విమర్శిస్తాడు. పేదవాడికి ఆ రోజు వచ్చేది ఎప్పుడో చెప్పమని నిలదీస్తాడు. రాయలసీమలో రైతును మోసం చేస్తున్న వర్షాలను, నాయకులను, దళారీలను నిలదీస్తాడు. నిన్న మొన్నటివరకు అంతా వేదాల్లో ఉందనే వాదనతో కొంతమంది పబ్బం గడుపుతున్నారు. ఇప్పుడు కొత్తగళం విప్పుతూ అంతా ఇంగ్లీషులోనే ఉంది అంటూ చెప్పకుపోతున్న ప్రభుత్వ వాదనలను నేరుగా విమర్శిస్తాడు ఈశ్వర్ రెడ్డి. “మాతృభాష అమ్మ. ఆంగ్లభాష ప్రేయసి. ప్రేయసి కోసం అమ్మను చిన్నచూపు చూడనక్కరలేదు” అనడంలో ఆయన మాతృభాషాభిమానమే కాకుండా వాస్తవిక దృష్టి అర్థమవుతుంది.

ఈ కవితా సూక్తులు అన్నీ చూసిన తర్వాత కవిగా ఈశ్వర్ రెడ్డి విద్యారంగాన్ని, వ్యవసాయ రంగాన్ని, సీమ అస్తిత్వాన్ని, సామాజిక రుగ్మతలను, రాజకీయ నాయకుల అబద్ధపు వాగ్దానాలను విమర్శకు పెట్టడంలో ఏమాత్రం వెనకడుగు వేయలేదనిపిస్తుంది. ఇవి చూడడానికి సరదాగా అనిపించినా, వీటిలో ఎంతో లోతైన ధర్మాగ్రహం ఉంది. ప్రజాస్వామ్యం మంచి ఫలితాలతో పరిఢవిల్లాలనే ఆశ వుంది. వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్న వారిని చొక్కా పట్టుకుని నిలదీయాలనే అంత ఆవేశం ఉంది. విద్యుత్తుకు అంతరాయం కలిగి, చీకటి ఆవరించినపుడు దృష్టికి అవసరమయ్యే టార్చ్‌లైట్ లాంటి సూక్తులుగా ఈ కవితలు కనిపిస్తున్నాయి.

– డా॥ పి.సి.వెంకటేశ్వర్లు
94901 64963

బతుకు మొక్కలకు ...

అమృతం కావాలన్నామా?
ఆకాశగంగను పెరట్లో దింపమన్నామా?
యావజ్జీవితం ఇంటద్దె సదుపాయాలు
ప్రయాణ భత్యాలు కోరుకున్నామా?
ఎన్నాళ్ళైనా ఎన్నేళ్ళైనా
కే.పూ నాటి జీతాలే కదా
ఆకాశానికి నిచ్చెన వేసే ధరలతో
పప్పూఉప్పూ అందరాని వస్తువులై
అల్లంత దూరంలో
మినుకుమినుకు మంటున్నపుడు
పస్తుల అక్షరమాలలు తప్ప
కడుపు నింపే పాఠాలెక్కడ?
ఊరిలో పసిపిల్లలందరికీ
పాలపొడి పంచే చేతులు
బానెడు బొజ్జ ఊచపుల్లల కాళ్ళున్న
మా పిల్లాడికి ఆకలి తీర్చలేని శూన్యహస్తాలు
గ్రామంలో గర్భవతులందరికీ
పౌష్టికాహారం అందించే నాకు
గంజి మెతుకులు కూడా ఊరించే పంచభక్ష్య పరమాన్నాలే
అటు పూర్తిగా చావలేక
ఇటు అందరిలా ఊపిరి పరిమళాలు పీల్చలేకా
త్రిశంకు స్వర్గంలో
ఏ ఆధారం ఆధార్ లేక
గుడ్డెద్దు చేలో పడ్డట్టు కుంటి నడక నడుస్తున్న
మా బతుకు దీపాలను వెలిగించడానికి
కాసింత జీతం చమురు పొయ్యండి
ప్రజల బాగోగులను పట్టించుకొనే వాడే ప్రభువు
బాబూ! మా గోడు పట్టించుకోండి
మా బతుకు మొక్కలకు
కాసిన్ని నీళ్ళు పొయ్యండి !

– మందరపు హైమవతి

స్టార్టప్ ఇండియా నిర్వీర్యం

- ఏడేళ్ల కనిష్టానికి పడిపోయిన పెట్టుబడులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశీయ స్టార్టప్‌లలో పెట్టుబడులు 80 శాతం తగ్గాయి. 26 ఒప్పందాల్లో మొత్తం 143.9 మిలియన్ డాలర్లు వచ్చాయి. ఈ మేరకు ఫైనాన్షియల్ రిసెర్చ్ వేదిక ట్రాక్సన్ ఇచ్చిన డేటా ప్రకారం గతేడాది జనవరి 13 నుంచి 19 వరకు 30 రౌండ్లలో సుమారు 722 మిలియన్ డాలర్ల సేకరించారు. ప్రధాని మోడీ ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకొచ్చిన 'స్టార్టప్ ఇండియా' నిర్వీర్యమవుతున్నది. 2022లో దేశంలోని స్టార్టప్ కంపెనీలకు ఫండింగ్ ద్వారా 25 బిలియన్ డాలర్ల (రూ. 2.07 లక్షల కోట్లు) నిధులు సమకూరగా, 2023లో ఇది 7 బిలియన్ డాలర్లకు (రూ. 58 వేల కోట్లు) (73 శాతం తగ్గుదల) పడిపోయింది. స్టార్టప్‌లకు నిధుల కొరత ఈ స్థాయిలో ఏర్పడటం గడిచిన ఏడేళ్లలో ఇదే తొలిసారని 'ట్రాక్సన్' నివేదికలో వెల్లడించింది. స్టార్టప్ ఫండింగ్ ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలోనూ భారత్ స్థానం పడిపోయింది. 2021, 2022లో ఈ విషయంలో నాలుగో ర్యాంకులో ఉన్న భారత్.. 2023 నాటికి ఐదో స్థానానికి పరిమితమైంది.

మోడీ ఫొటో పెట్టలేదని...

- బెంగాల్‌కు రూ.7 వేల కోట్ల నిధులు నిలిపివేత

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లోని రేషన్ దుకాణాల్లో ప్రధాని నరేంద్ర మోడీ ఫొటోలు పెట్టలేదన్న కారణంతో జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఆ రాష్ట్రానికి ఇవ్వాల్సిన ఏడు వేల కోట్ల రూపాయల నిధుల్ని కేంద్రప్రభుత్వం నిలిపివేసింది. నిధులు బదిలీ చేసేందుకు కేంద్రం రెండు షరతులు విధించిందని బెంగాల్ ఆహార శాఖ సీనియర్ అధికారులు తెలిపారు. అందులో ఒకటి... ప్రతి రేషన్ షాపు ముందు మోడీ చిత్రంతో బ్యానర్ లేదా ఫ్లెక్సీని ఏర్పాటుచేయాలి. రెండోది... పాయింట్- ఆఫ్ -సేల్ పరికరం నుంచి జారీ అయ్యే అక్‌నాలెడ్జ్‌మెంట్ స్లిప్పు మీద జాతీయ ఆహార భద్రతా సంస్థ లోగో ఉండాలి. 'వీటిని బెంగాల్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మొదట కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక చేసింది. ఆ తర్వాత ఈ పథకం కింద రాష్ట్రానికి డబ్బు ఇవ్వకూడదని నిర్ణయించుకుంది' అని ఓ అధికారి చెప్పారు.కేంద్రం నిధులు నిలిపివేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 70 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకూ 30శాతం మాత్రమే సేకరించగలిగింది.

ఆఫ్ఘన్‌లో కుప్పకూలిన రష్యా ప్రైవేట్ జెట్

కాబూల్ : ఆరుగురుతో ప్రయాణిస్తున్న రష్యాకు చెందిన ఒక ప్రైవేట్ జెట్ ఆఫ్ఘనిస్థాన్‌లో కుప్పకూలిపోయింది. విమానంలో ఉన్న ఆరుగురు మరణించి ఉంటారని అధికారులు తెలిపారు. బదఖస్థాన్ రాష్ట్రంలోని జెబాక్ జిల్లా మారుమూల పర్వత ప్రాంతంలో శనివారం ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు ఆదివారం తెలిపారు.రష్యా పౌరవిమానయాన అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం ఈ విమానం ఇద్దరు ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో భారత్‌లోని గయ నుంచి ఉజ్బెకిస్థాన్‌లోని తాష్కెంట్‌కు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.



మాస్కోలో ర్యాలీ..

న్యూఢిల్లీలోని సిపిఎం కేంద్ర కార్యాలయంలో లెనిన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీతారాం ఏచూరి, హాజరైన పార్టీ నాయకులు

దేశవ్యాప్తంగా లెనిన్‌కు ఘననివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కమ్యూనిస్టు మహోపాధ్యాయులలో ఒకరైన విఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఆదివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలో సిపిఎం కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితోపాటు పార్టీ నేతలు, కార్యకర్తలు విఐ లెనిన్‌కు ఘనంగా నివాళులర్పించారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో లెనిన్ విగ్రహానికి సిపిఎం నేత, లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ బిమన్ బసు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీం, పొలిట్‌బ్యూరో సభ్యులు సూర్యకాంత్ మిశ్రా, రామచంద్ర డోమ్ తదితరులు పూలతో ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో లెనిన్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా బిమన్ బసు.. లెనిన్ జీవిత చరిత్రను వివరించారు. త్రిపుర అగర్తలలో సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జితిన్ చౌదరితో సహ పార్టీ నేతలు లెనిన్ చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో లెనిన్ వర్ధంతి నిర్వహించారు. తమిళనాడులోని చెన్నైలో సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె బాలకృష్ణన్‌తో సహ పార్టీ నేతలు నివాళులర్పించారు. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా సహ వివిధ రాష్ట్రాల్లో లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

రష్యా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన మాస్కోలో ర్యాలీ

మాస్కో: ఇరవయ్యో శతాబ్దిలో ప్రపంచ గతినే మార్చివేసిన అక్టోబర్ మహా విప్లవ సారధి విఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా రాజధాని మాస్కోలో రష్యన్ కమ్యూనిస్టు పార్టీ ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. రష్యా విప్లవ వారసత్వానికి భిన్నంగా నడుస్తున్న పుతిన్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి కార్యక్రమం చేపట్టకున్నా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన రష్యా అంతటా సభలు, సమావేశాలు నిర్వహించారు. రెడ్ స్క్వేర్‌లో వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. లెనినిజం అజేయం అని నినదించారు. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ ఉన్నంతవరకు లెనినిం ప్రాధాన్యత కలిగివుంటుందని ర్యాలీలో పాల్గొన్న రష్యన్ సెనేటర్ ఒకరు పేర్కొన్నారు. లెనిన్ గురించి మరచిపోయేలా చేయాలని పాలకులె ఎంతగా యత్నిస్తున్నప్పటికీ, ఆ మహనీయుని ప్రభావం మరో వందేళ్లయినా చెక్కు చెదరదని పలువురు రష్యన్లు పేర్కొన్నారు.

లెనిన్ స్ఫూర్తితో వర్గ పోరాటాలు బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

మంజూరులో భారీ కోత విధిస్తుందని, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు, పన్నుల విధానంలో మార్పులు రాష్ట్ర వనరులను హరిస్తున్నాయని అన్నారు. ఇవన్నీ కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో లేవనెత్తుతున్న అంశాలని, ఢిల్లీలో నిర్వహించనున్న ఆందోళనలో కూడా ఈ డిమాండ్లను లేవనెత్తుతుందని ఏచూరి తెలిపారు.

కోల్‌కతాలో లెనిన్ వర్ధంతి సందర్భంగా మాట్లాడుతున్న సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీమ్

అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ట రోజున సెలవు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని ఏచూరి అన్నారు. ఒక మతానికి సంబంధించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వం సెలవు ప్రకటించడం దారుణమన్నారు. ప్రభుత్వ సంస్థలు మూసివేయడం మంచిది కాదని, అందులోనూ ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఎయిమ్స్‌కు సెలవు ప్రకటించడం దారుణమని అన్నారు. మతపరమైన కార్యక్రమాలతో ప్రభుత్వ పాలనను కలగాపులగం చేయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు.

లెనిన్‌కు నివాళులర్పించినవారిలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నిలోత్పల్ బసు, కేంద్ర కమిటీ సభ్యులు జోగేంద్ర శర్మ, హన్నన్ మొల్లా, సిపిఎం ఢిల్లీ కార్యదర్శి కెఎం తివారీ, ఎఐకెఎస్ నేత కృష్ణ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎంత తేడా?!

- నాడు సోమనాథ్‌లో ప్రాణ ప్రతిష్ఠకు ప్రాధాన్యత ఇవ్వని నెహ్రూ
- అక్కడికి వెళ్లవద్దని అప్పటి రాష్ట్రపతికి సూచన
- గైర్హాజరైన పలువురు ప్రముఖులు
- నేడు రాజకీయ కార్యక్రమంగా అయోధ్య ఈవెంట్
- ఊదరకొడుతున్న కార్పొరేట్ మీడియా

1951లో సోమనాథ్ దేవాలయంలో జరిగిన ప్రాణ ప్రతిష్ఠకు, ఇప్పుడు అయోధ్యలో జరుగుతున్న అదే తరహా కార్యక్రమానికి మధ్య ఎంత తేడా ?!. నాటి కార్యక్రమానికి అప్పటి ప్రధాని నెహ్రూ ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదు. పైగా దానికి హాజరు కావద్దని రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్‌కు సలహా ఇచ్చారు. మరి నేడో... అయోధ్య వెళ్లడమే గొప్పగా నాయకులు భావిస్తున్నారు. దానిని ఓ రాజకీయ ఈవెంట్‌గా మార్చేశారు. మీడియా సంస్థలు సైతం విపరీతమైన హైప్ సృష్టించి తమ వంతు సాయం చేస్తున్నాయి. వెరసి...అయోధ్యలో అంతా మోడీమయంగా కన్పిస్తోంది.

న్యూఢిల్లీ : ప్రజల నుండి సేకరించిన విరాళాల ద్వారా మాత్రమే సోమనాథ్ దేవాలయాన్ని పునరుద్ధరించాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ భావించారు. 1951లో ఆ ఆలయానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఇప్పుడు అయోధ్యలో జరుగుతున్నది ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి సోమనాథ్ దేవాలయం ఎన్నో పాఠాలు నేర్పుతోంది.

ఏదో ఒక మత విశ్వాసానికి ప్రాతినిధ్యం వహించే ప్రార్థనా మందిరం కోసం ప్రభుత్వ నిధులను వెచ్చించకూడదని మహాత్మా గాంధీ ఇచ్చిన సలహాను పటేల్ పాటించారు. మతం విషయంలో తటస్థ వైఖరి ప్రదర్శించాలన్నది గాంధీ అభిప్రాయం. 1947 నవంబర్ 28న ఢిల్లీలో జరిగిన ప్రార్థనా సమావేశంలో సోమనాథ్ దేవాలయ పునరుద్ధరణను ప్రస్తావిస్తూ ఆయన ఇదే మాట చెప్పారు. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రభుత్వం వివిధ మత విశ్వాసాలను అనుసరిస్తున్న భారతీయులందరిదీ అని ఆయన అన్నారు. 'ఇది లౌకిక ప్రభుత్వం. ఇది ఏ మతానికీ సంబంధించింది కాదు' అని స్పష్టం చేశారు.

నెహ్రూ ఏమన్నారు?

సోమనాథ్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొనడాన్ని ప్రధాని నెహ్రూ ఇష్టపడలేదు. 1951 మే 11న సోమనాథ్ దేవాలయ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనాలని, దానిని ప్రారంభించాలని అప్పటి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌కు ఆహ్వానం అందింది. దీనిపై ఆయన ప్రధాని నెహ్రూ అభిప్రాయాన్ని కోరారు. ఆ కార్యక్రమానికి హాజరు కావద్దని రాజేంద్ర ప్రసాద్‌కు నెహ్రూ సలహా ఇచ్చారు. భారత రిపబ్లిక్ అధిపతిగా దేశ లౌకిక స్వభావానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారని గుర్తు చేశారు. ఒకవేళ ఆ కార్యక్రమానికి రాష్ట్రపతి హాజరైతే పరిపాలనకు సంబంధించిన లౌకిక స్వభావానికి వ్యతిరేకంగా వ్యవహరించినట్లు అవుతుందని భావించారు.

సోమనాథ్ దేవాలయంలో కార్యక్రమం జరగడానికి 19 రోజుల ముందు... అంటే 1951 ఏప్రిల్ 22న... రాజేంద్ర ప్రసాద్‌కు నెహ్రూ ఓ లేఖ రాశారు. సోమనాథ్ వ్యవహారాలపై తన ఆందోళనను అందులో వ్యక్తం చేశారు. 'నేను భయపడుతున్నట్లుగానే ఈ కార్యక్రమం కొంత రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంటోంది' అని తెలిపారు. ప్రపంచ దేశాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని గురించి చెప్పుకుంటున్నారని వివరించారు. 'మనలాంటి లౌకిక ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాల విషయంలో ఎలా వ్యవహరించాలన్న దానిపై మనల్ని ప్రశ్నిస్తున్నారు' అని తెలిపారు. పార్లమెంటులో కూడా ఈ అంశంపై తనను అనేక ప్రశ్నలు వేశారని, ఈ కార్యక్రమంతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని చెప్పానని, ఎవరైనా వెళ్లినా అది వారి వ్యక్తిగతమని తెలియజేశానని వివరించారు.

భిన్న వైఖరులు

అయోధ్య ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నేపథ్యంలో 73 సంవత్సరాల క్రితం నెహ్రూ చేసిన వ్యాఖ్యల్ని గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకప్పటి బాబ్రీ మసీదును కూలదోసి అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించారు. మందిర నిర్మాణాన్ని అనుమతిస్తూనే బాబ్రీ మసీదు కూల్చివేత చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయోధ్య కార్యక్రమంలో ప్రధాని మోడీ సహ పలువురు కేంద్ర ప్రభుత్వ పెద్దలు, వివిధ రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు భాగస్వాములవుతున్న విషయం తెలిసిందే. దీంతో ఇది ఓ రాజకీయ కార్యక్రమంగా మారిపోయింది.

సోమనాథ్ దేవాలయం

సోమనాథ్ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా నెహ్రూను నాటి సౌరాష్ట్ర ప్రభుత్వాధినేత (రాజ్‌ప్రముఖ్) దిగ్విజయ్ సింగ్ ఆహ్వానించారు. అందుకు ఆయన నిరాకరించారు. ఇందుకు భిన్నంగా ఇప్పుడు తమకు ఆహ్వానం అందడాన్నే ప్రధాని మహద్భాగ్యంగా, గర్వకారణంగా భావిస్తున్నారు. సోమనాథ్ కార్యక్రమానికి హాజరైతే విదేశాల్లోనే కాక స్వదేశంలోనూ విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని నెహ్రూ భావించారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి మట్టి, నదుల నుండి నీరు పంపాలంటూ వివిధ దేశాల్లోని భారత రాయబారులకు రాజ్‌ప్రముఖ్ నేరుగా లేఖలు రాయడంపై నెహ్రూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అభ్యర్థనలు దేశానికి అవమానకరమని అన్నారు. దేశంలోని ఓ దేవాలయాన్ని విదేశీ మట్టి, నీటితో ఎలా పునర్నిర్మిస్తారంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నెహ్రూ మాత్రమే కాదు... సర్వేపల్లి రాధాకృష్ణన్, సి.రాజగోపాలాచారి, మృదులా సారాభాయ్ వంటి పలువురు ప్రముఖులు సైతం సోమనాథ్ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరు కారాదని నిర్ణయించుకున్నారు.

మరి ఇప్పుడు అయోధ్యలో జరుగుతోంది ఏమిటి? పైగా కార్పొరేట్ సంస్థల నియంత్రణలో ఉన్న టీవీ ఛానల్స్, పత్రికలు అయోధ్య కార్యక్రమానికి విశేష ప్రాచుర్యాన్ని కల్పిస్తున్నాయి. అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల్ని గాలికి వదిలేశాయి. సోమనాథ్ కార్యక్రమం కవరేజిపై అప్పటి ప్రధాని నెహ్రూ మీడియా సంస్థలకు పలు ఆదేశాలు జారీ చేశారు. దానిని ఓ ప్రభుత్వ కార్యక్రమంగా చూపవద్దని సూచించారు. ఇప్పుడు మోడీ వ్యవహరిస్తున్న తీరు దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. ఆకాశమే హద్దుగా మీడియా సంస్థలు అయోధ్యపై కుప్పలు తెప్పలుగా కథనాలు వండి వారుస్తున్నాయి.

దళితులకు అవమానం

- రాజస్థాన్‌లో 'అశుద్ధం' పేరిట రామమందిర విరాళాలు వెనక్కి
- దళిత సంఘాల ఆగ్రహం

జైపూర్ : అయోధ్యలో రామ మందిరం పేరిట వేల కోట్ల విరాళాలు వసూలయ్యాయి. ఈ నేపథ్యంలో రామ మందిర ప్రారంభోత్సవంలో భాగంగా అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. సెక్యులర్ భావనను సైతం లెక్క చేయకుండా కేంద్రంలోని మోడీ సర్కారు, బిజెపి ఆ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నాయి. రాజస్థాన్‌లోనూ 'అయోధ్య'కు విరాళాలు వసూలయ్యాయి. ఈ విషయంలో అక్కడి దళితులకు తీవ్ర అవమానం ఎదురైంది. రామ మందిర ఆచారాల కోసం తాము ఇచ్చిన విరాళాలను అశుద్ధం పేరిట తిరిగి తమకే ఇచ్చారని ఝులవార్ జిల్లాలోని దళితులు ఆరోపించారు. పెత్తందారీ కులాలకు చెందిన వ్యక్తులు ఇలా చేశారని తెలిపారు. ఈ నెల 9న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామ మందిర ఆచారాల నిర్వహణ కోసం నిధులకు పెత్తందారీ కులాలకు చెందిన వ్యక్తులే తమను సంప్రదించి, చివరకు ఇలా చేశారని దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పక్షపాతం, వివక్ష'కు గురి చేశారని దళితులు జిల్లా యంత్రాంగానికి సైతం ఈనెల 11న ఫిర్యాదు చేశారు.

నేడు రామ్‌లల్లా ప్రతిష్ఠ

(మొదటిపేజీ తరువాయి)

లేదు. మాజీ న్యాయమూర్తి అశోక్ భూషణ్ హాజరుకానున్నారు.

వందకి పైగా సోషల్ మీడియా అకౌంట్లు బ్లాక్

పాకిస్తాన్‌కి చెందిన సోషల్ మీడియా అకౌంట్లు విష ప్రచారానికి ప్లాన్ చేస్తున్నాయని, మత సామరస్యం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను లేదా అనుమానాస్పద కార్యకలాపాలను పర్యవేక్షించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పోలీసులను కేంద్ర హోం శాఖ ఇటీవల కోరింది. తప్పుడు కంటెంట్ వ్యాప్తి చేస్తున్న ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్, యూట్యూబ్, ఎక్స్ (ట్విట్టర్) లకు సంబంధించిన వంద సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసింది.

అయోధ్యకు చంద్రబాబు, పవన్

మరోవైపు ఆంధ్రప్రదేశ్ నుంచి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన నాయకులు పవన్ కల్యాణ్ ప్రత్యేక విమానంలో ఆదివారం రాత్రి అయోధ్యకు బయలుదేరి వెళ్లారు.

ఎయిమ్స్‌లో హాఫ్ డే సెలవుపై వెనక్కు తగ్గిన యాజమాన్యం..!

సోమవారం ప్రకటించిన హాఫ్ డే సెలవు నిర్ణయం నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్ వెనక్కు తగ్గింది. వైద్యుల అపాయింట్‌మెంట్లు తీసుకున్న రోగుల కోసం ఔట్ పేషంట్ విభాగం సోమవారం అంతా యథాతథంగా పని చేస్తుందని ఆదివారం జారీ చేసిన ఓ సర్క్యులర్‌లో తెలిపింది. ఆల్ క్రిటికల్ క్లినికల్ కేర్ సర్వీసులు యథాతథంగా కొనసాగుతాయని వివరించింది. రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఎయిమ్స్ ఆసుపత్రిని సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకూ మూసి ఉంచుతామని ఎయిమ్స్ శనివారం ప్రకటించింది. ఎయిమ్స్ నిర్ణయాన్ని తప్పుపడుతూ పలువురు ప్రతిపక్ష నేతలు సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

విజయవాడ దిగ్బంధనం

(మొదటిపేజీ తరువాయి)

ఉందని అనుమానించే అన్ని ప్రాంతాలను గాలిస్తున్నారు.

ప్రభుత్వం ఇంతటి తీవ్రస్థాయిలో నిర్బంధ చర్యలు చేపట్టినా..అడ్డంకులను అన్నింటిని అధిగమించి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పెద్ద సంఖ్యలో విజయవాడ చేరుకున్నారు. ఆదివారం రాత్రి వందలాది మంది అంగన్‌వాడీలు విజయవాడ ధర్నా చౌక్ వద్ద దీక్షా శిబిరం పరిసర ప్రాంతాల్లో నడిరోడ్డు మీదే నిద్రించారు.

మరోవైపు అంగన్‌వాడీలను విధుల నుండి తొలగిస్తున్నట్లు పలు జిల్లాల కలెక్టర్లు ప్రకటనలు చేశారు. అన్ని జిల్లాల్లో రైల్వేస్టేషన్లు, బస్ స్టేషన్లు, కలెక్టరేట్ల దగ్గర్లో అంగన్‌వాడీల టెంట్ల వద్ద పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే ఎక్కడికక్కడ వందలాదిమందిని అదుపులోకి తీసుకున్నారు. కాకినాడ టూటౌన్ పోలీసుస్టేషన్లో అంగన్‌వాడీలను సెల్లో వేశారు. అక్కడ వారు నినాదాలు చేస్తూ పోలీసుల తీరును ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలోకి వెళుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావును పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు.

మరోవైపు అంగన్‌వాడీల సమ్మెలో అసాంఘికశక్తులు చొరబడతాయని సమాచారం ఉందంటూ పోలీసులు మీడియాకు సమాచారం ఇచ్చారు. ధర్నాచౌక్‌లో అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షా శిబిరం వద్దకు రాత్రి పదిగంటల సమయంలో సుమారు 100 మంది మహిళా కానిస్టేబుళ్లు చేరుకున్నారు. నిరవధిక దీక్ష చేస్తున్న ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఎలిజబెత్ ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు రైల్వేస్టేషన్లలో ఎక్కడికక్కడ అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలిస్తుండటంతో స్టేషన్లలోనే బైఠాయింపులకు దిగారు.. విజయవాడ నగరంలో ఎక్కడికక్కడ సిపిఎం నాయకులను అదుపులోకి తీసుకుంటున్నారు. గృహ నిర్బంధాలకు దిగుతున్నారు. మచిలీపట్నం, గుడివాడలోనూ గృహ నిర్బంధం చేశారు.

సిపిఎం ఖండన

బాబూరావు అరెస్టును సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. ఈడ్చుకుపోయి అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలోనూ వేర్వేరు స్టేషన్లలో సెల్‌లో మహిళలను ఉంచారని, రాత్రి సమయాల్లో వారిని స్టేషన్లలో నిర్బంధించడం చట్ట విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యాత్రలో పాల్గొనవద్దని ప్రజల్ని అస్సాం ప్రభుత్వం బెదిరిస్తోంది : రాహుల్ గాంధీ

బిస్వనాథ్ ఛారియాలి (అస్సాం) : భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొనవద్దని ప్రజల్ని అస్సాం ప్రభుత్వం బెదిరిస్తోందని రాహుల్ గాంధీ విమర్శించారు. యాత్రా మార్గంలో కార్యక్రమాలకు అనుమతి నిరాకరిస్తోందని చెప్పారు. అస్సాం ప్రభుత్వ బెదిరింపులకు ప్రజలు భయపడటం లేదని రాహుల్ గాంధీ తెలిపారు. ఆదివారం విశ్వనాథ్ జిల్లా హెడ్‌క్వార్టర్ విశ్వనాథ్ ఛారియాలి వద్ద జరిగిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. త్వరలో అస్సాంలో జరిగే ఎన్నికల్లో బిజెపిపై కాంగ్రెస్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఈ యాత్రలో నేను ప్రసంగాలు ఇవ్వడం లేదు. ప్రతిరోజు 7 నుంచి 8 గంటల వరకూ ప్రయాణం చేస్తున్నాను. మీ సమస్యలు వింటున్నాను. మీ సమస్యలు పరిష్కరించడమే నా లక్ష్యం' అని రాహుల్ తెలిపారు. ఆదివారం ఉదయం అరుణాచల్ ప్రదేశ్ నుంచి బిస్వనాథ్ జిల్లాలోకి ప్రవేశించడం ద్వారా యాత్ర మళ్లీ అస్సాంలో ప్రవేశించింది.

కాంగ్రెస్ ర్యాలీ అసోంకు మంచి చేయదని అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ అన్నారు. అయోధ్యలోని రాముని గుడిలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నేపథ్యంలో భారత్ జోడో న్యాయ యాత్ర రూట్‌ను పున:పరిశీలించాలని రాహుల్‌ను కోరారు. బతద్రవ వద్ద శ్రీమంత శంకర్‌దేవ జన్మస్థలాన్ని సందర్శించొద్దని చెప్పారు. రాహుల్ పర్యటిస్తే టివి ఛానెళ్లు ఒకవైపు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని, మరోపక్క రాహుల్ పర్యటనను ప్రసారం చేస్తాయనీ, ఇది అసోంకు మంచిది కాదని అన్నారు.

గాజాలో పౌరుల రక్షణకు..

అంతర్జాతీయ మిషన్‌ను పంపండి

- అలీనోద్యమ మంత్రుల సమావేశంలో క్యూబా డిమాండ్
- దక్షిణాఫ్రికాకు ప్రశంసలు
- ఇజ్రాయిల్ నేరాలను వెనకేసుకొస్తున్న దేశాల వైఖరికి ఖండన

కంపాలా : గాజాలో పాలస్తీనా పౌరుల రక్షణకు అంతర్జాతీయ రక్షణ మిషన్‌ను వెంటనే పంపాలని అలీనోద్యమ శిఖరాగ్ర సదస్సు (నామ్) సన్నాహక మంత్రుల స్థాయి సమావేశం డిమాండ్ చేసింది ఇజ్రాయిల్ యుద్ధ నేరాలపై విచారణ జరిపించాలని ఉద్యమిస్తున్న దక్షిణాఫ్రికాను నామ్ అభినందించింది. అదే సమయంలో ఇజ్రాయిల్ నేరాలను సమర్ధిస్తున్న అమెరికా, ఇతర పశ్చిమ దేశాల వైఖరిని అది ఖండించింది. ఈ సమావేశంలో క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ పర్రిల్లా ఈ సమావేశంలో మాట్లాడుతూ, అంతర్జాతీయ చట్టాలను, నియమావళిని ఉల్లంఘిస్తూ గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమాన్ని యుద్ధ నేరంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు 121 రాష్ట్రాలతో కూడిన అలీనోద్యమంలో కొత్త సభ్యునిగా రిపబ్లిక్ ఆఫ్ సౌత్ సూడాన్ చేర్చుకోవడాన్ని క్యూబా స్వాగతిస్తుందన్నారు. ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో జరుగుతున్నది మానవాళికే అవమానకరం, దీనిని తక్షణమే ఆపాలని కోరారు.

పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలిపేందుకు, , పాలస్తీనాను సార్వభౌమత్వం కలిగిన దేశంగా ప్రకటించాలన్న డిమాండ్ సాధనకు అంతర్జాతీయ శాంతి సదస్సు నిర్వహించాలని క్యూబా కోరుతుందన్నారు.. ఐక్యరాజ్యసమితిలో సభ్య దేశంగా పాలస్తీనా ముందస్తు ప్రవేశానికి అలీనోద్యమం మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. తూర్పు జెరూసలేం రాజధానిగా, యూదు వలసవాసులను వెనక్కి తీసుకుని, 1967కి ముందున్న సరిహద్దులతో స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు తమ పూర్తి మద్దతు ఉంటుందని క్యూబా విదేశాంగ మంత్రి పునరుద్ఘాటించారు. ఇదొక్కటే దీనికి న్యాయమైన, సమగ్రమైన శాశ్వతమైన పరిష్కారమని ఆయన నొక్కి చెప్పారు.

నామ్ సదస్సులో మాట్లాడుతున్న క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ పర్రిల్లా

అలీనోద్యమ ఛైర్మన్ హోదాలో అజర్‌బైజాన్‌కృషిని ఆయన అభినందించారు. సంక్లిష్టమైన అంతర్జాతీయ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నామ్ అధ్యక్షుని హోదాలో అది ప్రశంసనీయమైన కృషి చేసిందన్నారు. ప్రపంచ పరిస్థితి నామ్ ముందు అపారమైన సవాళ్లను ఉంచింది. వీటిని మనం ఐక్యంగా మాత్రమే ఎదుర్కోగలమని ఆయన అన్నారు. క్యూబా విప్లవ నేత ఫిడెల్ కాస్ట్రో 45 సంవత్సరాల క్రితం అలీనోద్యమం గురించి ప్రస్తావిస్తూ "అన్యాయం, అసమానతలు, అణచివేత ఆధారంగా పనిచేస్తున్న ప్రస్తుత అంతర్జాతీయ సంబంధాల వ్యవస్థను మార్చే ప్రయత్నంలో నామ్ ముందుండాలని " చెప్పిన మాటలను ఆయన ఈ సందర్భంగా ఉటంకించారు. పేద దేశాల న్యాయబద్ధమైన వాదనలను పరిష్కరించడానికి సమర్ధవంతమైన చర్యలకు నాయకత్వం వహించేందుకు జి- 77, చైనా ఐక్యంగా కృషి చేయాల్సి ఉందన్నారు. బహుళ ధ్రువ ప్రపంచాన్ని బలోపేతం గావించడంతోబాటు , ఐక్యరాజ్యసమితి చార్టర్ , అంతర్జాతీయ చట్టం పట్ల పూర్తి గౌరవం, నిబద్ధతను కలిగినట్టి నూతన ప్రపంచ వ్యవస్థ కోసం మనం పోరాడాలన్నారు. పశ్చిమ సహారా ప్రజల స్వయం నిర్ణయాధికారం కోసం జరుగుతున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ఆయన అన్నారు. . క్యూబాపై అమెరికా సుదీర్ఘంగా కొనసాగిస్తున్న ఆర్థిక దిగ్బంధనానికి స్వస్తి పలకాలన్న న్యాయసమ్మతమైన డిమాండ్‌కు మద్దతు ఇస్తున్న ప్రపంచ దేశాలకు ఆయన అభినందనలు తెలిపారు.

మీ కోసం

ఇంట్లో వృధాగా మిగిలిపోయిన పెరుగు ప్యాకెట్లలోని పెరుగుతో రాగి, ఇత్తడి పాత్రలను తోమితే సులభంగా శుభ్రం అవుతాయి.

జీవన సౌరభం

గెలవడంలో ఓడిపోవచ్చు గానీ, ప్రయత్నించడంలో ఓడిపోవద్దు.

విపత్తు - వివేకం



పూర్వం సింహళం రాజ్యాన్ని సింహబలుడు అనే రాజు పాలిస్తుండే వాడు. ఆయన పాలనలో ఓ పెద్ద అరణ్యం వుండేది. అందులో అరణ్యానందుడు పర్ణశాలను నిర్మించుకుని విద్యాభ్యాసం నేర్పేవాడు. ఆయన వద్ద ఎందరో విద్య నేర్చుకుని ఉన్నత స్థానాలను అధిరోహించారు. అందులో రాజు వద్ద వున్న మంత్రి మరీచుడు కూడా వున్నాడు.

నిరక్షరాస్యుడైన సింహబలుడికి తలలో నాలుకలా ఉంటూ రాజ్యాన్ని ప్రగతి పథంలో నడిపించేవాడు. అయితే రాజు, తన మూర్ఖత్వంతో, తెలివి లేని ఆలోచనలతో మంత్రిని ఎప్పుడూ ముప్పు తిప్పలు పెట్టేవాడు.

ఓసారి రాజ్యంలో వరదలు వచ్చి, అపరిశుభ్రత అధికమైంది. దోమలు ఎక్కువై విష జ్వరాలు ప్రబలాయి. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. దీన్ని చూస్తున్న సింహబలుడు మంత్రిని పిలిచి 'దేవుడు మన రాజ్యంపై పగపట్టాడు. అందరూ ఆయన్ని ప్రసన్నం చేసుకోవాలి. పూజలు చెయ్యమని ప్రజలకు చెప్పండి' అని ఆజ్ఞాపించాడు.

మంత్రి మరీచుడుకి ఇది నచ్చలేదు. 'ప్రభూ! దోమలు వ్యాపించి ప్రాణాలు పోతుంటే పూజలు చేస్తే ఏం వస్తుంది? జ్వరాలు అదుపులోకి వస్తాయా? జ్వరాలు అదుపులోకి రావాలంటే దోమల్ని నిర్మూలించాలి. ఆ పని చేయండి..!' అని హితవు చెప్పాడు. ఆ మాటలు సింహబలుడికి నచ్చలేదు. తను చెప్పినట్లు చేయాల్సిందేనని ప్రజలపై ఒత్తిడి తెచ్చాడు.

రోజులు గడుస్తున్నా, జ్వరాలు అదుపులోకి రాలేదు. రాజు ప్రవర్తనతో విసిగిపోయి ప్రజలు బాధపడసాగారు. ఈ విపత్కర పరిస్థితుల నుండి ఎలాగైనా ప్రజల్ని బయటపడేయాలని, మరీచుడు అరణ్యానందుడిని కలిసి ఉపాయం అడిగాడు.

పరిస్థితిని విన్న అరణ్యానందుడు రాజ్యంలోకి వచ్చాడు. ప్రజలు పడుతున్న పాట్లు గమనించాడు. అపరిశుభ్ర పరిసరాలను శుభ్రం చేశాడు. దోమల నివారణ మందు తెచ్చి పిచికారీ చేశాడు. కొద్ది రోజులకు దోమలు అదుపులోకి వచ్చాయి. దీన్ని చూసి ప్రజలు అరణ్యానందుడిని, మంత్రిని ప్రశంసించారు. ఈ విషయం సింహబలుడుకి తెలిసింది.

'మీరంతా దైవానికి పూజలు చేయడం వల్లే విష జ్వరాలు తగ్గాయి. ఇదంతా నా కృషి. మీరు నన్ను గౌరవించాలి కాని.. వాళ్లని ప్రశంసిస్తారేంటి' అని ఆగ్రహించాడు.

అప్పుడు ప్రజలు జరిగింది వివరించారు. అది విన్న సింహబలుడికి నిజం బోధ పడింది. విపత్కర సమయంలో వివేకంతో ఆలోచించాలని తెలిసింది. తను చేసిన పొరపాటుకు 'క్షమించండి' అని కోరాడు. ఆ తర్వాత అరణ్యానందుడిని తన సలహాదారుగా నియమించుకొని, వివేకంతో పాలించసాగాడు.

- బోగా పురుషోత్తం, తుంబూరు.

నేను గీసిన బొమ్మ

పవిత్ర,
ఏడవ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
హవేళి ఘణపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

శీతాకాలంలో గుండె జర భద్రం!

శీతాకాలంలో చలి వల్ల వచ్చే వ్యాధుల్లో గుండె సంబంధితమైనవి కూడా సింహభాగంలోనే ఉంటున్నాయి. మన శరీరంలో అతి ముఖ్యమైన అవయవం గుండె. శరీరానికంతటికీ రక్తాన్ని సరఫరా చేయటంతోపాటుగా అనేక రకాల విధులను గుండె నిర్వర్తిస్తుంది. దాని నిర్వహణతీరుపైన ఒత్తిడి పెంచితే ప్రమాదం బారిన పడతాం. సరైన ఆహారపు అలవాట్లు, మెరుగైన జీవనశైలి, ప్రశాంతమైన వాతావరణంలో ఉండగలిగితే గుండె సంబంధిత వ్యాధులు దరిచేరబోవు. చలికాలంలో శరీర ఉష్ణోగ్రతను సమతౌల్యం చేయడానికి గుండె ఎక్కువ పనిచేయాల్సి వుంటుంది. హృదయ నాళ వ్యవస్థ బలహీనంగా ఉంటే గుండె ఎక్కువగా శ్రమపడినప్పుడు సమస్య పెరుగుతుంది.

సాధారణంగా 45 ఏళ్ల పైబడిన పురుషులు, 55 ఏళ్ల పైబడిన మహిళలు గుండె జబ్బులకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది. ఇలాంటి సమస్యలే కుటుంబంలో ఉంటే మిగతా వారికి కూడా వచ్చే అవకాశం ఉంది. తాజా గణాంకాల ప్రకారం ఏటేటా హృద్రోగ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుంది. చాలా సందర్భాల్లో గుండెపోటు ఉదయం 4 నుంచి 7 గంటల మధ్య వస్తుంది. వేసవి కంటే శీతాకాలంలోనే ఈ కేసులు ఎక్కువగా ఉంటాయి. చలితో గుండె ధమనులు కుంచించుకుపోవటం కూడా ఒక కారణం. బీపీ పెరిగినా గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదాన్ని గమనించటం ద్వారా కొన్ని వైద్యపరమైన పద్ధతులను అనుసరించటం ద్వారా నివారించొచ్చు.

కొన్ని జాగ్రత్తలు

గుండె సమస్యలు ఉన్నవారు ఈ మరింత జాగ్రత్తగా ఉండాలి. తాజా పండ్లు, కూరగాయలు, విత్తనాలు, కాయలు, చిక్కుళ్లు, పప్పుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. ఆల్కాహాల్ చర్మంలోని రక్త నాళాలకు విస్తరించి, శరీరంలోని ముఖ్యమైన అవయవాల నుంచి వేడిని తీసుకుంటుంది. ధూమపానం గుండె వైపు ఆక్సిజన్ ప్రవాహాన్ని తగ్గిస్తుంది. హదయ స్పందన రేటు, రక్తపోటును పెంచుతుంది. ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పడిపోవడం వల్ల రక్త నాళాలు సంకోచిస్తాయి. గుండెపై అదనపు ఒత్తిడి పెరిగి ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. కాబట్టి తగిన ఉష్ణోగ్రత ఉన్న గదుల్లో ఎక్కువ గడపాలి. శరీర ఉష్ణోగ్రత 95 డిగ్రీల కంటే తక్కువగా ఉంటే, గుండె కండరాలకు హాని కలిగించే అల్పోష్ణస్థితికి గురవుతారు. చల్లని వాతావరణంలో ఎక్కువ సమయాన్ని గడిపేవారు, రక్తపోటు, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్ సమస్యలున్నవారు, ధూమపానం, పొగాకు తీసుకునే వారికి ఈ స్థితి ఇబ్బందికరం.

వైద్యపరీక్షలు ముఖ్యమే ...

గుండెపోటుకు ప్రధాన కారణం గుండెకు దారితీసే రక్తనాళాల్లో అడ్డుపడటం. ఇలాంటివి ముందుగానే గుర్తించేందుకు ఏడాదికి ఒకసారైనా పూర్తి శరీరాన్ని టీఎంటీ అనే ట్రెడ్ మిల్ టెస్ట్ చేయించుకోవటం మంచిదని డాక్టర్లు సూచిస్తున్నారు. గుండె జబ్బులు, స్ట్రోక్, కార్డియోవ్యాస్కులర్ వంటి ప్రమాద కారకాలను ఈ టెస్ట్ ద్వారా తెలుసుకోవచ్చు. ధూమపానం చేయటం, శారీరక శ్రమ చేయకపోవటం, అధిక బరువు కూడా గుండె వ్యాధులకు దోహదం చేస్తాయి. హృదయ ఆరోగ్యానికి దోహదపడే వాటిలో కొలెస్ట్రాల్, రక్తపోటు, గ్లూకోజ్ నియంత్రణ ముఖ్యం. గుండె సంబంధిత వ్యాధుల్లో స్ట్రోక్, పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు, రిథమ్ డిజార్డర్లు, సబ్‌క్లినికల్ అథెరోస్క్లెరోసిస్, కరోనరీ హార్ట్ డిసీజ్, హార్ట్ ఫెయిల్యూర్, హార్ట్ డిసీజ్, సిరల వ్యాధి, పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ వంటివి కూడా ఉంటాయని చెబుతున్నారు.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కనీసం వారానికి ఒకసారి బీపీని చెక్ చేసుకోవాలి
- పెరిగితే డాక్టరును సంప్రదించాలి
- బయటకు వెళ్లేటప్పుడు వెచ్చదనాన్నిచ్చే దుస్తులు ధరించాలి
- కొవ్వు, పిండి పదార్థాలను తగ్గించాలి
- ఊబకాయం, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి
- క్రమం తప్పకుండా మందులు వాడాలి
- శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి
- ఉన్ని బట్టలు, టోపీలు, గ్లౌజులు, సాక్సులు ధరించాలి.
- ఇండోర్ వ్యాయామాలను ఎంచుకోవాలి గుండెకు ఒత్తిడి కలిగించే వ్యాయామాలూ చేయొద్దు
- మద్యపానం, ధూమపానం పూర్తిగా మానేయాలి
- భోజనం, సూప్ వేడివేడిగా తీసుకుంటూ ఉండాలి.
- ఉప్పు, చక్కెర బాగా తగ్గించాలి.
- జంక్‌ఫుడ్ పూర్తిగా మానేయాలి.

హృదయ సంబంధిత వ్యాధులు

మనిషి సగటు జీవితకాలంలో గుండె సుమారుగా 2.5 మిలియన్‌సార్లు కొట్టుకుంటుందని అంచనా. అంటే రోజుకు సుమారు లక్షసార్లు కొట్టుకుంటుంది. పురుషులతో పోల్చితే మహిళల్లో గుండె కొట్టుకోవటం చాలా వేగంగా ఉంటుంది. ఆడవారిలో నిముషానికి 78 సార్లు, మగవారిలో 70 సార్లు గుండె కొట్టుకుంటుంది. రోజుకు 7200 లీటర్ల రక్తాన్ని శరీరం మొత్తానికి గుండె పంపిణీ చేస్తుంది. మనిషి తన సాధారణ జీవితంలో సుమారు మూడు ఆయిల్ ట్యాంకర్ల కన్నా ఎక్కువ మొత్తంలో రక్తాన్ని అవయవాలకు పంపిణీ చేస్తుంది.

ఆందోళన వద్దు అవగాహనే ముద్దు

ఎవరైనా గుండె బలహీనపడిందని తెలియగానే భయం, బాధ, ఆందోళన వ్యాధిని మరింత తీవ్రం చేస్తాయి. కానీ అందుకు కారణాలు చికిత్స అవకాశాలు గురించి అవగాహన ఉన్నప్పుడు భయం బదులు భరోసా లభిస్తుంది.

ఎక్కడికక్కడ అంగన్‌వాడీల అరెస్టు

- రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లలో పోలీసుల విస్తృత తనిఖీలు
- ఇప్పటికే వేలాదిగా విజయవాడ చేరుకున్న అంగన్‌వాడీలు

నంద్యాల జిల్లా బేతంచర్ల స్టేషన్లో పోలీసుల నిర్బంధంలో ఉన్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- యంత్రాంగం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర నలుమూలల నుంచి అంగన్‌వాడీలు విజయవాడకు ఆదివారం పెద్ద ఎత్తున కదిలారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కోటి సంతకాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డికి సోమవారం విజ్ఞప్తి చేయడానికి వీరంతా తరలివస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులు నిర్బంధానికి దిగారు. విజయవాడకు వెళ్లరాదంటూ సమ్మె శిబిరాలకు వచ్చి అంగన్‌వాడీలకు నోటీసులు ఇచ్చారు. విజయవాడకు వెళ్లనీయకుండా పలువురి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులను, అంగన్‌వాడీలను జిల్లాల్లో ఎక్కడకక్కడ అడ్డుకున్నారు. అరెస్టులు, గృహనిర్బంధం చేశారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లల్లో, బస్సుల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో కూడా అరెస్టులకు పాల్పడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం ప్రాజెక్టు పరిధిలోని 18 మంది అంగన్‌వాడీలను విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద అడ్డుకుని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. విజయనగరంలో పలువురిని గృహనిర్బంధం చేశారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 132 మందిని అరెస్టు చేశారు. కాకినాడ, సామర్లకోట పోలీస్ స్టేషన్లకు తరలించారు. కోటనందూరులో అరెస్టులకు పాల్పడ్డారు. అక్కడ అరెస్టు చేసిన వారిని తుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టును నిరసిస్తూ అంగన్‌వాడీలు పోలీస్ ఎదుట బైఠాయించారు. కడప రైల్వేస్టేషన్‌లో పలువురిని అడ్డుకున్నారు. కడపలో పలువురిని అరెస్టు చేసి వన్‌టౌన్ స్టేషన్‌ను తరలించారు. ప్రొద్దుటూరులో పలువురికి నోటీసులు ఇచ్చారు. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెలో అంగన్‌వాడీలను అరెస్టు చేసి సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచుకుని ఆ తర్వాత విడిచిపెట్టారు. మదనపల్లెలోని పెద్దతిప్పన సముద్రం (పిటిఎం) రైల్వే స్టేషన్‌లో విజయవాడకు వెళ్తున్న అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకుని రైలు నుంచి దించేశారు. ఈ నేపథ్యంలో మఫ్టీలో ఉన్న ఎస్ఐ సుధాకర్‌కు, సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులుకు మధ్య వాగ్వివాదం చేసుకుంది. అంగన్‌వాడీలపై దాడికి ఎస్ఐ యత్నించారు. దీనిని నిరసిస్తూ రైల్వే స్టేషన్లో బైఠాయించిన సుమారు 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీలకు, సిఐటియు నేతలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పలువురి నేతలను గృహనిర్బంధంలో ఉంచారు. ఏలూరు జిల్లాలోనూ పలువురి అంగన్ వాడీలకు, నాయకులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. నంద్యాల జిల్లా బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో 50 మందికిపైగా అంగన్‌వాడీలను, యూనియన్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కర్నూలు జిల్లా కర్నూలు, ఓర్వకల్లు, దేవనకొండ, కోసిగిలలో వందలాది మందిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. దీంతో, వారు అక్కడ ఆందోళనకు దిగడంతో విడిచిపెట్టారు. సోంపేటలో 39 మందిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కంచిలి, పొందూరులో పలువురిని గృహ నిర్బంధం చేసి చేశారు.

'హనుమాన్'కు ఊహించని సక్సెస్

విడుదలకు ముందే అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్న 'హనుమాన్' సినిమా ఊహించని రీతిలో విజయాన్ని సొంతం చేసుకుంది. తేజ సజ్జా, ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో వచ్చిన ఈ సినిమా సాంకేతికంగా ఆకట్టుకుందనే పేరు తొలిరోజు నుంచీ వచ్చింది. తెలుగులో ఈ సబ్జెక్టు కొత్త పోకడకి తెర లేపింది. హాలీవుడ్ సినిమాల్లో స్పైడర్‌మ్యాన్, ఐరన్‌మ్యాన్ తరహా పాత్ర 'హనుమాన్' చిత్రంలో చూసిన ప్రేక్షకులు ఎంతో థ్రిల్‌కి గురయ్యారు. చిన్నా, పెద్దా కలసి వచ్చి సినిమాని విజయవంతం చేశారు. తక్కువ బడ్జెట్‌లో రూపొందిన ఈ చిత్రం మొదటి నుండీ పాజిటివ్ టాక్‌తో దూసుకుపోయింది. రెట్టింపు లాభాలను తెచ్చిపెట్టింది. ఈ వరసలో మరిన్ని సినిమాలు తీయనున్నట్టు దర్శకుడు విజయోత్సాహంతో ప్రకటించాడు.

నాగార్జున 'నా సామిరంగ'

నాగార్జున ప్రతి సంక్రాంతికి ఓ సినిమా తప్పక విడుదల చేసే పనిలో ఉంటున్నారు. ఈ ఏడాది కూడా పల్లెటూరి నేపథ్యంలో 'నా సామిరంగ' చిత్రం ప్రేక్షకులను అలరించింది. వాస్తవానికి ఇది 'పొరింజు మరియమ్' అనే మలయాళ సినిమాకు తెలుగు రీమేక్. యాక్షన్, కామెడీ, పాటలు సందర్భానుసారంగా వస్తుంటాయి. పాత సినిమా కథలా ఉన్నా లవ్, యాక్షన్, ఎమోషన్ అన్ని అంశాలు ఉండేలా దర్శకుడు విజయ్ బిన్నీ జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సినిమాలో అల్లరి నరేష్, రాజ్‌తరుణ్ కనిపించి సందడి చేశారు.

మెప్పించని సైంధవ్

వెంకటేష్ 75వ సినిమాగా వచ్చిన 'సైంధవ్' పెద్దగా ఆదరణకు నోచుకోలేదు. వెంకటేష్ టేకింగ్, యాక్టింగ్ ఫర్వాలేదనిపించినా స్క్రీన్‌ప్లేలో సాగదీత ధోరణి కనిపించింది. కథనంలో కూడా పొంతనలేని అంశాలను స్పృశించారు. దీంతో ప్రేక్షకులు గందరగోళానికి గురయ్యారు. మొదటి షో నుండే సినిమాపై అంచనాలన్నీ తలకిందులయ్యాయి. వెంకటేష్ సినిమాలకి ఫ్యామిలీ ఆడియన్స్ ఎక్కువ. కానీ ఈ సినిమా అంతా యాక్షన్ మోడ్‌తో తెరకెక్కించారు. భావోద్వేగ అంశాల ప్రభావం పెద్దగా లేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

రన్నరప్ సాత్విక్-చిరాగ్

ఇండియా ఓపెన్ ఫైనల్లో ఓటమి

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్లో భారత డబుల్స్ జోడీ ఓడి రన్నరప్‌గా నిలిచారు. మూడుసెట్ల హోరాహోరీ పోరులో సాత్విక్-చిరాగ్ జంట 21-15, 11-21, 18-21తో కాంగ్ మిన్ హ్యుక్-సియో సంగ్ జీ(కొరియా) చేతిలో పరాజయాన్ని చవిచూశారు. ఈ మ్యాచ్ సుమారు గంటా 5నిమిషాలసేపు సాగింది. తొలి గేమ్‌ను సునాయాసంగా నెగ్గిన భారత జంట.. రెండో గేమ్‌లో అదే రీతిలో ఓడారు. ఇక నిర్ణయాత్మక మూడోగేమ్ పోటాపోటీగా సాగింది. చివర్లో పాయింట్ల పరంగా కొరియా జంటకు చేరువైనా ఒత్తిడికి లోనై ఓటమిపాలయ్యారు. ఇక పురుషుల సింగిల్స్ టైటిల్‌ను 6వ సీడ్ చైనాకు చెందిన షి-యు-ఖీ చేజిక్కించుకున్నాడు. ఫైనల్లో షీ-యు 23-21, 21-17తో లీ-ఛౌక్ యు(హాంకాంగ్)ను వరుససెట్లలో ఓడించాడు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లో 4వ సీడ్ తైజు-యింగ్(చైనీస్ తైపీ) 21-16, 21-12తో 2వ సీడ్ చెన్-యు-ఫీ(చైనా)ను ఓడించి టైటిల్‌ను చేజిక్కించుకుంది.

క్వార్టర్స్‌కు జకో, రుబ్లేవ్

- సిట్సిపాస్ ఔట్..
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



సిట్సిపాస్‌ను ఓడించిన ఫ్రిట్జ్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, టాప్‌సీడ్ నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. ఆదివారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో సెర్బియాకు చెందిన జకోవిచ్ 6-0, 6-0, 6-3తో 20వ సీడ్ మన్నారివో(ఫ్రాన్స్)ను ఓడించాడు. ఇతర ప్రి క్వార్టర్స్ పోటీల్లో 4వ సీడ్ సిన్నర్, 5వ సీడ్ రుబ్లేవ్ ప్రత్యర్థులను చిత్తుచేయగా.. 7వ సీడ్ సిట్సిపాస్ అనూహ్యంగా ప్రి క్వార్టర్స్‌ను ఓటమిపాలయ్యాడు. సిట్సిపాస్ 6-7(3-7), 7-5, 3-6, 3-6తో 12వ సీడ్ టి. ఫ్రిట్జ్(అమెరికా) చేతిలో ఓడాడు. ఇక సిన్నర్(ఇటలీ) 6-4, 7-5, 6-3తో 15వ సీడ్ ఖచనోవ్(రష్యా), 5వ సీడ్ రుబ్లేవ్(రష్యా) 6-4, 6-7(5-7), 6-7(4-7), 6-3, 6-0తో 10వ సీడ్ డి-మినర్(ఆస్ట్రేలియా)ను ఓడించి క్వార్టర్స్‌కు చేరారు.

క్రేజికోవా, సబలెంకా కూడా..

మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి 2వ సీడ్ సబలెంకా(రష్యా), 9వ సీడ్ క్రేజికోవా(చెక్) ప్రవేశించారు. ఆదివారం జరిగిన ప్రి క్వార్టర్స్ పోటీల్లో సబలెంకా 6-3, 6-2తో అనిసిమోవా(అమెరికా), క్రేజికోవా 4-6, 6-3, 6-2తో ఆండ్రీవా(రష్యా)ను చిత్తుచేశారు. మరో పోటీలో 4వ సీడ్ కోకా గాఫ్(అమెరికా) 6-1, 6-2తో ఎం. ఫ్రెచ్(పోలండ్), ఎం కోస్ట్యుక్(ఉక్రెయిన్) 6-2, 6-1తో మరియా టిమోఫివా(రష్యా)ను చిత్తుచేసి క్వార్టర్స్‌కు చేరారు.

ప్రాక్టీస్.. ప్రాక్టీస్...

- నెట్స్‌లో చెమటోడ్చుతున్న టీమిండియా
- 25న హైదరాబాద్ వేదికగా ఇంగ్లండ్‌తో తొలిటెస్ట్

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఈనెల 25నుంచి భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. స్వదేశంలో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో భారత ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా సత్తా చాటాలనుకుంటు న్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో బుమ్రా రాణించాడు. "మీకు తెలుసా నాకు ఇష్టమైన ఫార్మాట్ టెస్టు క్రికెట్. ఎందుకంటే ఆ ఫార్మాట్ అంటే నాకిష్టం. టెస్ట్ క్రికెట్ ఆడటం నా కల. అది నెరవేరింది. టెస్టుల్లో నాకు కొన్ని ప్రత్యేక జ్ఞాపకాలున్నాయి. ఈ ఫార్మాట్‌లో నా మొదటి వికెట్ ఏబీ డివిలియర్స్‌ది. ఇదే నాకెంతో ప్రత్యేకమైనది" అని బుమ్రా పేర్కొన్నాడు. ఇక హైదరాబాద్ చేరకున్న టీమిండియా ఆటగాళ్ల ఆదివారం నెట్ ప్రాక్టీస్‌లో చెమటోడ్చారు. హైదరాబాద్ పేసర్ సిరాజ్, బుమ్రా బ్యాటర్లకు బంతులను విసిరారు. ఇంగ్లండ్ క్రికెటర్లు నేడు హైదరాబాద్ చేరుకుంటారని హెచ్‌సిఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు వెల్లడించాడు.

బ్రూక్ తిరుగు పయనం

ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ హారీ బ్రూక్ భారత్‌తో టెస్ట్ సిరీస్‌కు దూరమయ్యాడు. టెస్ట్ సిరీస్ ఆడేందుకు జట్టు సభ్యులతో కలిసి భారత్ వచ్చిన బ్రూక్ వ్యక్తిగత కారణాలరీత్యా ఇంగ్లండ్‌కు తిరుగు పయనమయ్యాడు. ఈమేరకు ఇంగ్లండ్ క్రికెట్‌బోర్డు (ఇసిబి) ఆదివారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. దీంతో 24ఏళ్ల బ్రూక్ స్థానంలో డాన్ లారెన్స్‌ను ఇసిబి ఎంపిక చేసింది.

గెలుపునకు చేరువలో ఆంధ్ర

అస్సాంతో రంజీట్రోఫీ

డిస్పూర్(అస్సాం): రంజీట్రోఫీ గ్రూప్ లీగ్‌లో భాగంగా అస్సాంతో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు గెలుపు దిశగా పయనిస్తోంది. ఆంధ్ర జట్టు మూడోరోజై ఆదివారం 9వికెట్ల నష్టానికి 334పరుగుల వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేయడంతో అస్సాం ముందు 363పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచగల్గింది. భారీ లక్ష్యంతో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన అస్సాం జట్టు ఆట నిలిచే సమయానికి 5వికెట్ల నష్టానికి 81పరుగులు చేసింది. క్రీజ్‌లో కెప్టెన్ రియాన్ పరాగ్(46) తోడు సుమిత్(6) ఉన్నారు. ఆంధ్ర బౌలర్లు గిరినాథ్‌కు మూడు, లలిత్ మోహన్‌కు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆంధ్ర జట్టు కెప్టెన్ రికీ బుయ్(125) సెంచరీకి తోడు హనుమ విహారి(63) అర్ధసెంచరీతో రాణించారు. అస్సాం బౌలర్ సిద్ధార్థ్‌కు ఐదు వికెట్లు దక్కాయి. అస్సాం జట్టు చివరిరోజు 66ఓవర్లలో 282పరుగులు చేయాల్సి ఉండగా.. మరో ఐదు వికెట్లు కూలిస్తే ఆంధ్రకు విజయం దక్కనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68